Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 28 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 25 - 7 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## ఇండియా, ఇంగ్లాండ్ మధ్య కీలక వాణిజ్య ఒప్పందం




**ఇంటర్నెట్ డెస్క్:** భారత్–బ్రిటన్ సంబంధాల్లో ఇవాళ చరిత్రాత్మక రోజు అని ప్రకటించారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. చాలా ఏళ్ల కృషి తర్వాత భారత్–బ్రిటన్ మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరగడం సంతోషకరమన్నారు. AI, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఇరుదేశాలు కలిసి ముందుకు సాగుతామని మోదీ చెప్పారు. బ్రిటన్, భారత్ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని కూడా మోదీ తెలిపారు. భారత్‌లో త్వరలో ఆరు బ్రిటన్ వర్సిటీలు తమ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయని ప్రధాని మోదీ చెప్పారు.

ఇరుదేశాల సేవల రంగం.. ఆర్థిక, సాంకేతిక రంగాలకు ఊతమిస్తుందని మోదీ అన్నారు. ఈ ఒప్పందం ద్వారా సులభతర వాణిజ్య విధానానికి మరింత ఊతం వచ్చిందని వ్యాఖ్యా నించారు. 'ఇరుదేశాల మధ్య ఉపాధి కల్పన అవకాశాలు విస్తృతం అవుతాయి. భారత్–బ్రిటన్ భాగస్వామ్యంలో విజన్–2035 లక్ష్యంగా సాగుతున్నాం.' అని మోదీ తెలిపారు.

## జర్నలిస్టులకు గుడ్ న్యూస్.. తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన

**ఖమ్మం జిల్లా, (రాజధాని వార్తలు):** జర్నలిస్టులకు సంబంధించి కీలకమైన మూడు ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే జర్నలిస్ట్‌లకు కొత్త అక్రిడిటేషన్లు ఇస్తామని ప్రకటించారు. ఇవాళ (గురువారం, జులై 24) ఖమ్మం జిల్లాలోని వైరాలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాల్గో జిల్లా మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

**వచ్చేవారంలో అక్రిడిటేషన్ కార్డులు: మంత్రి పొంగులేటి**

వచ్చేవారంలో అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో యూనియన్ నాయకులతో చర్చించి ఫైనల్ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చిన తర్వాత వెంటనే హెల్త్ కార్డులు ఇస్తామని వెల్లడించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి సుప్రీంకోర్టులో ఉండటంతో న్యాయ నిపుణులతో




చర్చించి ఎలాంటి ఆటంకం కలగకుండా ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని మాటిచ్చారు. జర్నలిస్టుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఉద్ఘాటించారు. జర్నలిస్టులకు అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

## ఘోర ప్రమాదం.. ఏడుగురి మృతి




**సిమ్లా :** హిమాచల్‌ప్రదేశ్‌లో మాండీ జిల్లాలో గురువారం బస్సు లోయలో పడింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రయాణికులు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు.. మాండీ నుంచి సర్కాఘాట్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారని.. మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారన్నారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జిల్లా పోలీస్ ఉన్నతాధికారి వివరించారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు అన్వేషిస్తున్నామన్నారు. ఇక గత ఏడాది కాలంగా హిమాచల్‌ప్రదేశ్‌లో పలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. కొండ ప్రాంతాలు, ఇరుకైన రహదార్లు, వంకరటింకర రోడ్లు కావడం వల్లే తరచూ ఈ తరహా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనే వాదన సర్వత్రా వినిపిస్తోంది. మరి ముఖ్యంగా మండి, కులు, చంబా వంటి పర్వత ప్రాంత జిల్లాల్లో ఈ ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని చెబుతున్నారు.

## మంత్రి నారా లోకేష్‌ను ఆలింగనం చేసుకున్న పవన్ కళ్యాణ్

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన సినిమా హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా మంత్రులు అభినందనలు తెలిపారు. మంత్రి నారా లోకేష్‌ను ఆలింగనం చేసుకుని కృతజ్ఞతలు చెప్పారు పవన్ కళ్యాణ్. కేబినెట్ మీటింగ్ ముందు పవన్‌ను పిలిచి మరీ షేక్ హ్యాండ్ ఇచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు.

**హరి హర వీర మల్లు సినిమాను వీక్షించిన ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్**

మరోవైపు.. విశాఖపట్నం మద్దిలపాలెంలోని కిన్నెర కామేశ్వరి థియేటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన హరి హర వీరమల్లు సినిమాను ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ వీక్షించారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడారు. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తర్వాత వచ్చిన మొదటి సినిమా అద్భుతంగా ఉందని ప్రశంసించారు. పవన్ కళ్యాణ్ అద్భుత నటనతో ప్రేక్షకులను కట్టిపడేశారని కొనియాడారు పీవీఎన్ మాధవ్. ప్రేక్షకులను రంజింప చేయడానికే కాకుండా ఆలోచింపచేయడానికి ఈ చిత్రం తీశారని అభివర్ణించారు. ఈ సినిమాలో మల్లయుద్ధం హైలెట్ అని...అన్ని వర్గాల ప్రజలను




పవన్ కళ్యాణ్ మెప్పించారని చెప్పుకొచ్చారు. ఔరంగజేబు చేసిన అకృత్యాలు దాష్టికాలను ఈ చిత్రంలో బాగా చూపించారని కొనియాడారు. జిజియా పన్ను కట్టకపోతే ముస్లిమేతరులను వేధించిన తీరును బాగా చూపించారని ఉద్ఘాటించారు. మత సామరస్యాన్ని దెబ్బతీసిన ఔరంగజేబుపై సినిమా చేయడం చాలా సాహసమని నొక్కిచెప్పారు. భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను నిలబెట్టిన వీరుల కథలను సినిమాగా తీసినందుకు పవన్ కళ్యాణ్‌ని మన స్ఫూర్తిగా అభినందిస్తున్నామని తెలిపారు. ఎంతో కష్టపడి తీసిన ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించాలని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ కోరారు.

## ఏపీలో మరిన్ని నూతన పరిశ్రమలు.. కేబినెట్ ఆమోదం




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఇవాళ (గురువారం జులై24) ఏపీ సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఏపీలో మొత్తం రూ.70 వేల కోట్లు పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటన్నింటినీ గ్రౌండ్ చేయించిన పక్షంలో, లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. వీటిని మనం వెంటబడి గ్రౌండ్ చేయించాలని సూచించారు. ఐటీ, రెన్యువబబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్, డ్రోన్, ఆటోమొబైల్స్ రంగాల్లో ఈ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. త్వరలో ఇల్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇచ్చే కార్యక్రమం వెంటనే చేపట్టాలని.. ఈ విషయంపై అందరూ దృష్టి సారించాలని మంత్రులకు మార్గనిర్దేశం చేశారు సీఎం చంద్రబాబు. క్వాంటం వ్యాలీ మాదిరిగా మనం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీలో కూడా అందరి కంటే ముందు ఉండాలని.. దీనివల్ల మనకు ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని చెప్పుకొచ్చారు. సింగపూర్‌తో సంబంధాలపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయినప్పుడు మన చూపించిన చొరవతో సింగపూర్ ప్రభుత్వం ముందుకు వచ్చి మనకు సహాయం చేసిందని గుర్తు చేశారు. సింగపూర్ ప్రభుత్వం కూడా అలానే సహాయం చేసిందని ఉద్ఘాటించారు. చివరకు వాళ్లు కూడా అప్పటిలో రాజధానిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధికి సింగపూర్ కన్సార్టియం వచ్చిందని.. కానీ ప్రభుత్వం మారిన తర్వాత వాళ్లను వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై జగన్ ప్రభుత్వం అవినీతి ముద్ర వేసిందని... చివరకు వాళ్లపై అవినీతి ఆరోపణలు చేశారని ధ్వజమె త్తారు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులపై కేసు పెట్టేందుకు కూడా ప్రయత్నం చేశారని.. దీంతో వాళ్లు పూర్తిగా అసంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. సింగపూర్‌తో సంబంధాలు అన్నింటిని కూడా మాజీ సీఎం జగన్ చెడగొట్టారని.. అందుకనే వెళ్లి వాళ్లతో మళ్లీ మన సంబంధాలను పునరుద్ధరించుకోవాలని సూచించారు. సింగపూర్ కన్సార్టియం నిర్వాహకులు సీడ్ క్యాపిటల్ మినహా మిగతా ఏ ప్రాజెక్ట్ అయినా చేపడతామని అంటున్నారని అన్నారు. 2024- 2025 సంవత్సరానికి నీటి పన్నుపై వడ్డీను పూర్తిగా రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. తిరుపతి తొక్కిసలాటపై జస్టిస్ సత్య నారాయణ మూర్తి ఇచ్చిన కమిషన్ నివేదికపై కేబినెట్ లో చర్చించారు. ఇరువురు అధికారులపై చర్యలు తీసుకోవాలని మంత్రి మండలి ఆదేశాలు జారీ చేసింది. గో సంరక్షణ అధికారి, మరో డీఎస్పీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కేబినెట్ ఆదేశించింది. అప్పటి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుకు క్లీన్ చిట్ ఇచ్చింది ఏకసభ్య కమిషన్. భవనాలు క్రమబద్ధీకరణ విషయంలో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది కేబినెట్. దీనిపై ఒక స్పష్టమైన చట్టం తేవాలని భావించింది. ఈ సారి క్రమబద్ధీకరణ చేసి ఆ తర్వాత చట్టం తీసుకు వచ్చి భవిష్యత్‌లో ఏలాంటి అక్రమ నిర్మాణాలు చేయకుండా చూడాలని నిర్ణయించింది కేబినెట్. ఇలా ఎన్ని రోజులు క్రమబద్ధీకరణ చేసుకుంటూ వెళ్తామని కేబినెట్‌లో వ్యాఖ్యానించారు నాదెండ్ల మనోహర్. అందువల్లే మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుందామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## అనిల్ అంబానీకి చెందిన 50 కంపెనీలపై ఈడీ సోదాలు

**ఇంటర్నెట్ డెస్క్:** మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఢిల్లీ, ముంబైలోని రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి చెందిన 50 కంపెనీలపై ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) సోదాలు జరుపుతోంది. వీటికి సంబంధించి 35 చోట్ల ఈ సోదాలు చేస్తున్నారు. 25 మందిని ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తాజాగా నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల తర్వాత ఈడీ దాడులు జరుగుతుండటం విశేషం. ప్రాథమిక దర్యాప్తులో 'బ్యాంకులు, వాటా దారులు, పెట్టుబడిదారులు, ఇతర ప్రభుత్వ సంస్థలను మోసం చేయడం ద్వారా ప్రజా ధనాన్ని స్వాహా చేయడానికి ప్రణాళికాబద్ధమైన కుట్ర చేసినట్టు తేలింది. అంతే కాదు, అన్ సెక్యూర్డ్ లోన్స్ ప్రక్రియను సులభతరం చేయడానికి యెస్ బ్యాంక్ లిమిటెడ్ మాజీ ప్రమోటర్లతో సహా సీనియర్ బ్యాంక్ అధికారులకు లంచాలిచ్చినట్టు కూడా ఆరో పణలున్నాయి. 2017 – 2019 మధ్య, యస్ బ్యాంక్, రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్ కింద ఉన్న RAAGA కంపెనీలకు సుమారు రూ. 3,000 కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. రుణాలు మంజూరు చేయడానికి ముందు, యస్ బ్యాంక్ ప్రమోటర్లు క్విడ్ ప్రోకో విధానంలో లబ్ధిపొందారని ఆరోపణలున్నాయి. కాగా, ఈడీ దర్యాప్తులో అనేక కీలక విషయాలు గుర్తించినట్టు తెలుస్తోంది. లోన్స్ డాక్యుమెంటేషన్ ప్రక్రియలో అనేక లోపాలు కనిపించినట్టు సమాచారం. ఈ లావాదేవీలకు సంబంధించి నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (NHB), సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (SEBI), నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (NFRA), బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి అనేక నియంత్రణ, ఇంకా ఆర్థిక సంస్థల నుంచి ఈడీ కావల్సిన సమాచారాన్ని సేకరించినట్టు తెలుస్తోంది. ఇందులో.. గ్రూప్ కంపెనీ అయిన రిలయన్స్ హౌమ్




ఫైనాన్స్ లిమిటెడ్ (RHFL)లో జరిగిన తీవ్రమైన అవకతవకలను ఎత్తిచూపి SEBI ఒక నివేదికను సమర్పించింది. నివేదిక ప్రకారం, సంస్థ యొక్క కార్పొరేట్ రుణ పోర్ట్‌ఫోలియో 2017–18 ఆర్థిక సంవత్స రంలో రూ. 3,742 కోట్ల నుండి 2018–19 ఆర్థిక సంవత్సరంలో రూ. 8,670 కోట్లకు దాదాపు రెట్టింపు అయింది. ఇక, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీ అయిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (RCom) ఇంకా, అంబానీ అకౌంట్లను చీటింగ్(మోసం) ఖాతాలుగా వర్గీకరించింది. బ్యాంక్.. ఈ ఖాతాను మోసపూరిత ఖాతాగా ముద్ర వేయడం ఇదే మొదటిసారి కాదు. SBI గతంలో నవంబర్ 2020లో RCom ఇంకా, అంబానీ అకౌంట్లను మోసం ఖాతాలుగా ప్రకటించింది. అంతేకాదు, జనవరి 5, 2021న CBIకి ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు జనవరి 6న స్టేటస్ కో ఆర్డర్ జారీ చేయడంతో ఫిర్యాదు ఉపసంహరించుకుంది. ఈడీ సోదాల నేపథ్యంలో ఇవాళ స్టాక్ మార్కెట్లో రిలయెన్స్ పవర్ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి.

## విజయవాడ, విశాఖలో మెట్రో రైలు నిర్మాణం.. టెండర్లు ఆహ్వానానికి ముహూర్తం ఖరారు




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నంలో మెట్రో రైలు నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. వీటి నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఆ క్రమంలో ప్రభుత్వం శుక్రవారం టెండర్లు పిలవనుంది. రూ.21,616 కోట్లతో విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు టెండర్లను ఆహ్వానించనుంది. అందులో రూ. 10,118 కోట్లతో విజయవాడ, రూ. 11,498 కోట్లతో వైజాగ్ మెట్రోలకు టెండర్లు పిలవనున్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఫిఫ్టీ, ఫిఫ్టీ భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. వైజాగ్ మెట్రో రైలుకు విఐఎం ఎంఆర్డీఏ నుంచి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ. 4,101 కోట్ల నిధులు మళ్లించనున్నారు. అలాగే విజయవాడ మెట్రోకు సీఆర్డీఏ నుంచి రూ.3,497 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా నిధులు మళ్లించనున్నారు.

# క్యారీ బ్యాగులకు డబ్బు వసూలు చేయడం అన్యాయమైన చర్య

## - ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్రమంత్రి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రిటైలర్లు.. కొనుగోలుదారుల నుంచి క్యారీ బ్యాగులకు డబ్బు వసూలు చేయడం అన్యాయమైన చర్య అని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి బి.ఎల్.వర్మ స్పష్టం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం లోక్‌సభలో ప్రస్తావించిన అంశాలపై కేంద్ర మంత్రి స్పష్టత ఇచ్చారు. రిటైలర్లు క్యారీ బ్యాగులకు డబ్బు చెల్లించమని అడగడాన్ని ప్రభుత్వం సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. డబ్బు వసూలు చేయడం అన్యాయమని జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ తీర్పు ఇచ్చింది వాస్తవమేనా ఆరా తీశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి బి.ఎల్.వర్మ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. వినియోగదారుల రక్షణ, సాధికారత కోసం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ 27.11.2024న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం వినియోగదారుల నుంచి క్యారీ బ్యాగులకు డబ్బు వసూలు చేయడం వినియోగదారుల రక్షణ చట్టం- 2019 ప్రకారం అన్యాయమైన వాణిజ్య పద్ధతికి సమానమని స్పష్టం చేశారు. ప్రపంచీకరణ, సాంకేతికతలు, ఇ-కామర్స్ మార్కెట్లు మొదలైన ఈ యుగంలో వినియోగదారుల రక్షణ కోసం వినియోగదారుల రక్షణ చట్టం, 1986 స్థానంలో కొత్తగా వినియోగదారుల రక్షణ చట్టం- 2019 అమలులోకి తెచ్చామన్నారు. కొత్త వినియోగదారుల రక్షణ చట్టం- 2019 ద్వారా సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ఏర్పాటు చేశామని, వినియోగదారుల కమిషన్లలో న్యాయనిర్ణయ ప్రక్రియను సరళీకరించడం, వినియోగదారుల కమిషన్ల ఆర్థిక అధికార పరిధిని పెంచడం, ఫిర్యాదును ఆన్‌లైన్‌లో దాఖలు చేయడం, విచారణ కోసం వీడియో కాన్ఫరెన్సింగ్, దాఖలు చేసిన 21 రోజుల్లోనే ఫిర్యాదులను అంగీకరించే వెసులుబాటు తీసుకొచ్చామని వివరించారు. కల్తీ ఉత్పత్తులు/ నకిలీ వస్తువుల తయారీ/అమ్మకానికి శిక్షా నిబంధనలు, ఇ-కామర్స్ అమ్మకాలలో అన్యాయమైన వాణిజ్య పద్ధతులను నివారించడానికి నిబంధనలు రూపొందించబడ్డాయని చెప్పారు. వినియోగదారుల రక్షణ చట్టం, 2019 నిబంధనల ప్రకారం, సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ 24.07.2020న ఉనికిలోకి వచ్చిందని, అన్యాయమైన వాణిజ్య పద్ధతుల వల్ల వినియోగదారులకు కలిగే నష్టాన్ని నివారించడానికి, వాపసులు, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా తప్పుదారి పట్టించే ప్రకటనలను నిరోధించడం, నియంత్రించడం దీని ప్రధాన ఉద్దేశమన్నారు.

# కష్టపడిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు

## - సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలిఅడుగు "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని విజయ వంతం చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అభినందించారు. టిడిపి శ్రేణులు 1 లక్ష 20 వేల ఇళ్లకు తిరిగి కూటమి ప్రభుత్వ ఏడాది పాలన విజయాయలను చేరవేసిన సందర్భాన్ని పురస్కరించుకొని కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆమె ఉద్వేగభరితంగా ప్రసంగించారు. కార్యకర్తే అధినేత అన్న లోకేష్ నినాదమే తనకు ఆదర్శమన్నారు. టిడిపి నాయకులు మరియు కార్యకర్తలు సుశిక్షితులైన సైనికులు అని నిరూపించుకున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కొనియాడారు. ఏడాది కాలంలో కూటమి పాలనలో సాధించిన విజయాలను గడప గడపకు చేర్చడంలో అంకితభావంతో పని చేసిన పార్టీ శ్రేణులను ఆమె అభినందించారు. ప్రభుత్వ లక్ష్యాలను చంద్రబాబు నాయుడు విజన్‌ను ప్రజలకు వివరించి పార్టీకి ప్రభుత్వానికి వారధిలా నిలిచారని ప్రశంసించారు. సుపరిపాలనలో తొలి అడుగు "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యిదే స్ఫూర్తి నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. అధికారం చేపట్టిన 13 నెలల కాలంలో సభ్యత్వ నమోదు మొదలు బూత్ లెవల్ కన్వీనర్ నుంచి మండల పార్టీ అధ్యక్షులు దాకా నియామకాలు చేసుకొని క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం చేసుకున్న క్రమాన్ని ఆమె పార్టీ శ్రేణులకు వివరించారు. కొత్త, పాత సమన్వయంతో ఐకమత్యంగా ముందుకు సాగాలని హితోపదేశం చేశారు. పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులు పెట్టినా వెనకడుగు వేయకుండా జండా మోసిన కార్యకర్తల త్యాగాలను విస్మరించన్నారు, పార్టీలో సీనియర్లకు సముచిత గౌరవం యిస్తానన్నారు. తనకు ఎవరి పట్ల వివక్ష లేదని అందరూ సమానమేనన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాటలు కార్యకర్తల్లో ఉత్సాహం నింపాయి. ఎవరు నిరుత్సాహ పడొద్దని కార్యకర్తలే పార్టీకి పునాది అని చాటి చెప్పిన మీ త్యాగాలను గుర్తించి పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు దశల వారీగా న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ యిచ్చారు. కార్యకర్తలకు ఏ సమస్య వున్న నిస్సంకోచంగా తన దృష్టికి తేవాలని కోరారు. తెలిసో తెలియకో తన వల్ల ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే మన్నించా లన్న ఆమె మాటలతో కార్యకర్తలు ఉద్వేగానికి లోనయ్యారు. నిత్యం ప్రజలలో వుండి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రజ లతో మమేకమై నాయకులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, బూత్ లెవల్ కన్వీనర్లు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జీలతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్ నగర్ కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించండి

## - జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**కోవూరు, (రాజధాని వార్తలు):** సాగునీటి సంఘాలు, డ్రిస్టిబ్యూషన్ కమిటిలను సమన్వయం చేసుకొని రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చివరి ఆయుకట్టు వరకు సాగునీరు అందించాలని కోరారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కోవూరు నియోజక వర్గంలోని 5 మండలాల్లో ఎన్‌టిఆర్ నగర్ కాలనీలలో తాగునీరు, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఎన్‌టిఆర్ నగర్ కాలనీలలో శాశ్వత నీటి సరఫరా కల్పించేందుకు 3 కోట్ల 78 లక్షలు మంజూరు చేయవలసిందిగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విజ్ఞప్తి చేశారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో 2017-18 నుండి 2019-20 సంవత్సరములలో ఇళ్ళు నిర్మించుకొని, ఆన్లైన్‌లో బిల్లులు నమోదు చేసిన వాటికి ఇప్పటివరకు కూడా డబ్బులు చెల్లించలేదన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో 3,094 మంది లబ్దిదారులకు చెల్లించాల్సిన 5 కోట్ల 26 లక్షలు త్వరతగతిన చెల్లించాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి ఫారూఖ్, మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మల దృష్టికి తెచ్చారు.

# హరిహర వీరమల్లు సినిమా మూవీ విడుదల సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ బైక్ ర్యాలీ బొబ్బేపల్లి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** హరిహర వీరమల్లు మూవీ విడుదల సందర్భంగా తోటపల్లి గూడూరు మండలంలో పోస్టర్ ఆవిష్కరణ బైక్ ర్యాలీ నిర్వహించిన సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు. హరిహర వీరమల్లు ఒక చారిత్రాత్మకమైనటువంటి ఒక సందేశాత్మకమైనటువంటి చిత్రం ఇది 1930లో ఔరంగాజేబు ఆనాటి హిందుత్వాన్ని అణచేయాలనేటువంటి ఆలోచనతో జరిగినటువంటి పరిపాలన విధానాన్ని హిందుత్వాన్ని నిలబెట్టడం కోసం పోరాటం చేసినటువంటి హరిహర వీరమల్లు నాయకత్వానికి సంబంధించినటువంటి చిత్రం మన భారతదేశంలో ఒక కోహినూర్ వజ్రం పుస్తకాల్లో మాత్రమే చదవడం జరిగింది అది ఇప్పుడు ఎక్కడ ఉంది దాన్ని ఎవరు తీసుకెళ్లారు దాన్ని ఎలా తెచ్చుకోవాలి అనేటువంటి విధానం కలిగినటువంటి సన్నివేశాలను ఇందులో తెరకెక్కించడం జరిగింది.

పవన్ కళ్యాణ్ ఏదైనా ఒక సినిమా తీశారు అని అంటే అది ఒక సందేశాత్మకంగా ఉంటుంది తప్ప దానిపైన లబ్ది పొందాలి అనేటువంటి ఆలోచన అయితే ఆయనకి ఉం డదు అందుకే కొన్ని కోట్లమంది అభిమానుల్ని అటు సినిమా రంగంలో గానీ ఇటు రాజకీయం రంగంలో గానీ వాళ్ల గుండెల్లో చిరస్థాయిగా స్థానం ఏర్పాటు చేసుకునటువంటి ఘనత ఈ పోటీ ప్రపంచంలో ఆయనకు మాత్రమే దక్కింది. ఆయన అభిమానిగా మేము ఎంతో గర్విస్తూ ఈ సినిమా ఎంతో ఆదరణ పొందుతుం దని ఆ భగవంతుని ఆశీస్సులు ఎప్పుడూ కూడా మా అధినేత పవన్ కళ్యాణ్ గారికి ఉంటాయని ఇటు ప్రజల ఆశీస్సులు కూడా ఉన్నాయని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో వెంకటాచల మండల కార్యదర్శి తందూరి శ్రీహరి తోటపల్లి గూడూరు మండల ప్రధాన కార్యదర్శి రాయపు పవన్, ముత్యాల అమర్నాథ్ బాబు, మనోహర్, ముత్తుకూరు మండల నాయకులు బోలా అశోక్, కావలి మస్తాన్, ఎలికం గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# చేపల మార్కెట్‌లో సౌకర్యాలు మెరుగుపరచండి : మేయర్ స్రవంతి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని 6వ డివిజన్ శెట్టిగుంట రోడ్ ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ, శ్రీధర్‌తో కలిసి మేయర్ స్రవంతి జయవర్ధన్ పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా 6వ డివిజన్‌లోని శెట్టిగుంట రోడ్డు చేపల మార్కెట్ ప్రాంతంలో పారిశుధ్య పనులను పరిశీలించడం జరిగింది. ఇక్కడ ఉన్నటువంటి చేపల మార్కెట్ సముదాయంలో వాటర్ ఫెసిలిటీ, షెడ్ వంటి సౌకర్యాలు మెరుగుపరచాలని మార్కెట్ సముదాయం వినియోగదారులు కోరడం జరిగింది. వారు అడిగిన సౌకర్యాలు నాలుగు అయిదు రోజుల్లో ఏర్పాటు చేస్తామని తెలియజేస్తున్నాను, ర్యాంపు, గేట్ వంటి సదుపాయాలు అడిగారు అవి అధికారులు ఎస్టిమేట్ చేసియున్నారు. ఆ పనులు వెంటనే ప్రారంభించేలా చూడాలని అధికారులకు సూచించడం జరిగింది అన్నారు. తర్వాత స్థానికంగా మౌలాసాహెబ్ వీధిలో పర్యటించి పారిశుధ్య పనులు నిర్వహణ మరియు సమస్యలను మేయర్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# యానాదులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తే ఆత్మహత్యలే శరణ్యం

## - యానాదుల సంక్షేమ సంఘం, నాయకులు ఎదుట విలపించిన కమ్మవారిపల్లి యానాదులు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సైదాపురం మండలం మొలకలపూండ్ల రెవెన్యూ కమ్మవారిపలి గ్రామంలో అనేక సంవత్సరాలుగా యానాదులు సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా ఖాళీ చేయించేందుకు సైదాపురం రెవెన్యూ అధికారులు ప్రయత్నాలు చేస్తూ యానాదులకు పదేపదే నోటీసులు పంపుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక కాలనీవాసులు యానాదుల సంక్షేమ సంఘం దృష్టికి తీసుకు రాగా ఈరోజు యానాదుల సంక్షేమ సంఘం, బృందం ఆ గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడి అనంతరం సైదాపురం ఎమ్మార్వోతో పై సమస్యపై చర్చించడం అయినది. గతంలో పని చేసిన ఎమ్మార్వో ఇలాంటి ప్రయత్నాలు చేయగా తాము కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆ ప్రయత్నాలను విరమించుకున్నారని మళ్లీ ప్రస్తుత ఎమ్మార్వో అలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది సరైనది కాదని ఎమ్మార్వోకి స్పష్టం చేయడమైనది. యానాదుల మైన తాము సాగు చేసుకుంటున్న పొలాల జోలికి వస్తే తమకు ఆత్మహత్యలే శరణమని బాధిత యానాదులు ఎమ్మార్వోకి తెలియజేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు స్పందించి యానాదులు సాగు చేసుకుంటున్న పొలాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసి పెంచలయ్య కోరడమైనది. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం, రాష్ట్ర అధ్యక్షులు కెసి.పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షులు, తలపల చెంచు మల్లికార్జునరావు, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, స్థానిక గిరిజనులు, ఏకోలు వెంకటయ్య, ఏకోలు శ్రీనివాసులు, కోలా రమేష్, యాదగిరి బాలు, ఏకోలు వెంకటేష్, ఏకోలు శ్రీనివాసులు, ఎల్లంపల్లి శీనయ్య, ఏకోలు అనంతయ్య పాల్గొన్నారు.

# ముంపు గ్రామ ప్రజలకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలి



**రాపూరు, (రాజధాని వార్తలు):** కండలేరు జలాశయం నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన రేగడపల్లి గ్రామ ప్రజలకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం తాసిల్దార్ లక్ష్మీ నరసిం హంకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేగడపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ కండలేరు జలాశయం నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన భూములు, నివాస స్థలాలకు నష్టపరిహారం చెల్లించి 15 సంవత్సరాలు అయినా నేటికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రావలసిన పునరావాస కేంద్రాన్ని నేటికి నిర్మించలేదన్నారు. గ్రామంలోని ఇల్లు శిథిలా వస్థకు చేరకోడమే కాకుండా, గ్రామానికి రాకపోకలు సాగించడానికి రోడ్లు అద్వానంగా మారడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మా గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ముంపు గ్రామమని చెప్పటం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముంపు గ్రామమైన రేగడపల్లి గ్రామస్తులకు మండలంలోని మద్దూరుపల్లి గ్రామము వద్ద పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ఆంజనేయులు నాయుడు, చెంచు రామయ్య, నారాయణ, రమణయ్య, గోపాల్ పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ డి ఓ కె.మాధురి



**తిరువూరు, (రాజధాని వార్తలు):** తిరువూరు మండలంలోని రోలుపడి గ్రామములో ఈరోజు పొలం పిలుస్తోంది కార్యక్రమం లో రైతులు మరియు విద్యార్ధులతో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారి కుమారి కె.మాధురి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మొదటగా గ్రామ పంచాయితీ కార్యలయములో రైతులతో ఉద్యానవన పంటలు, సేంద్రియ ఎరువులు వాడకం వాటి ఆవశ్యకత మరియు ప్రభుత్వం నుండి రైతులకు రాయితీ ద్వారా అందించే వ్యవసాయ పరికరాలు, పలు యంత్రాలను మరియు డ్రోన్‌లను రైతులు ఉపయోగించుట విషయమై రైతులకు అవగాహన కల్పించారు. తదుపరి మండల పరిషత్ పాఠశాల విద్యార్దులతో కలిసి రోలుపడి గ్రామములో వ్యవసాయ క్షేత్రంలో వరి నాట్లు వేయుచున్న పొలాలను సందర్శించి విద్యార్దులతో వ్యవసాయం యొక్క ఆవశ్యకత మరియు రైతులతో వారి కష్ట నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరువూరు తహసిల్దార్ ఉదయ భాస్కర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సి హెచ్.రవిబాబు, మండల వ్యవసాయ అధికారి పి.పద్మ మరియు ఇతర రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



## స్కాలర్షిప్ తీసుకున్నవారు రెన్యూవల్‌కు వార్త లిస్టు హాల్ టికెట్లను ఆగస్టు 23 లోపు అప్లికేషన్లు అందజేయాలి

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి గవరపాలెంలో శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వలె ఈ సంవత్సరం కూడా సంఘ నియమ నిబంధనలకు సరిపోయే అర్హత గల గవర జాతీయలు పేద విద్యార్థులకు ఉపకార వేతనాములు యిస్తున్నామని ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ తెలియజేశారు. 2025 -2026 పాలిటెక్నిక్, ఐఐఐటి, ఈసెట్టు, ఇంజనీరింగ్, మెడిసిన్, బి డి ఎస్, ఐఐటి, నెట్ మొదలగు టెక్నికల్ కోర్స్ ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంక్ సాధించిన అనకాపల్లి జిల్లా పరిసర ప్రాంతాల గవర పేద విద్యార్థులు ఆ కోర్సుల్లో చేరిన వారు ఉపకార వేతనాలు అప్లికేషన్లు ఈనెల 25 నుండి ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. శ్రీ గౌరీ సేవా సంఘం ఆఫీసులో దరఖాస్తు తీసుకోవాలని వారు తెలియజేశారు. పూర్తి చేసిన దరఖాస్తులు 3-09-2025 లోపు ఆఫీసులో అందజేయవలసిందిగా కోరారు. గతంలో స్కాలర్షిప్ తీసుకున్నవారు రెన్యూవల్ కొరకు వార్త లిస్టు హాల్ టికెట్లను ఆగస్టు 23 లోపు అప్లికేషన్లు ఆఫీసులో అందజేయాలని పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 9291445574 (శ్రీనివాస్) సంప్రదించాలని తెలియజేశారు.

# గొంతిన శంకర్ ఆధ్వర్యంలో హరిహర వీరమల్లు విజయానికే ప్రత్యేక పూజలు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** మన సేనాని, రాష్ట్ర డిప్యూటీ సీఎం, ప్రముఖ సినీ నటుడు కొణిదెల పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదలై భారీ విజయం సాధించాలని వ్యాపారవేత్త, జనసేన నాయకుడు గొంతన శివశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ర్యాలీ నిర్వహించారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాలు మేరకు జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ సూచనలతో మండలంలో గల రేబాక గ్రామంలో పోలిపలమ్మ అమ్మవారి గుడి వద్ద బుధవారం 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కరణం నాయుడు, మంత్రి కాసుల



నాయుడు, జనసేన నాయకులు జనసైనికులు, మెగా అభిమానులు పాల్గొన్నారు.

# సి ఎస్ ఆర్ నిధి చెక్‌ను అందజేసిన కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి బంగార్రాజు ముత్యాలమ్మపాలెం ఎన్ టీ పి సి సింహాద్రిలో కాంట్రాక్టు కార్మికుడు గా విధులు నిర్వహిస్తూ. ముత్యాలమ్మపాలెం గ్రామంలో మే 18, 2025న జరిగిన గొడవలో హత్య చేయబడ్డాడు, అతని కుటుంబ సభ్యులు స్థానిక శాసనభ్యులు పంచకర్ల రమేష్ బాబుకు ఆర్థిక సహాయ కోసం అర్జీ సమర్పించిగ, తక్షణమే శాసనసభ్యులు స్పందించి ఆర్థిక సహాయంపై తో యా త్సో రేర్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆచ్చుతాపురం ప్రతినిధులతో చర్చించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు స్పందించి హత్యకు గురైన అయన భార్య మైలపల్లి బంగారమ్మకు పిల్లల చదువు నిమిత్తం సిఎస్ఆర్ నిధులు క్రింద 1,20,760 చెక్కును బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతులు మీదుగా తో



యా త్సో రేర్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బి మురళీధరరావు లబ్ధిదారునికి చెక్‌ని అందజేశారు.

# ద్వారపురెడ్డి పరమేశ్వరావుకు అభినందనలు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కసింకోట మండలం కు చెందిన ద్వారపురెడ్డి పరమేశ్వరావును భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా రెండవసారి నియమితులైనందుకు పరమేశ్వరరావును కసింకోట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు గొంతిని చిరంజీవి నీటి సంఘం చైర్మన్ ఉప్పులూరు అప్పలనాయుడు మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకు నాయుడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాకాసి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ముందుగా చిరంజీవి మాట్లాడుతూ మంచి మనసున్నవ్యక్తి. సేవా దృక్పథం గల వ్యక్తి అందరూ బాగుండాలని కోరుకునే మన పరమేశ్వరరావును బిజెపి రాష్ట్ర నాయకులు అందరూ కలిసి అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులుగా నియమించడమం చాలా ఆనందంగా వుంది అని తెలియజేసి సాలువతో సత్కరించి అభినందనలు తెలియజేసారు. అప్పలనాయుడు మాట్లాడుతూ పరమేశ్వరరావు చేస్తున్నా సేవలు గుర్తించి బీజేపీ ఈయనకు ఇచ్చిన గౌరవం అని తెలియజేసి చేనేత సిడ్డి మేడలో వేసి అభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలలో రాణిస్తా

## - రవీంద్ర భారతి చిన్నారి ట్వింకిల్ పట్నాయక్ - విమెన్ అచీవర్స్ వీక్‌లో చిన్నారుల మనోభావాలు, ఆలోచనలు భేష్ - రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ సంతోషి



**శ్రీకాకుళం సిటీ, (రాజధాని వార్తలు):** స్థానిక మండలవీధిలో గల రవీంద్రభారతి పాఠశాలలో ఈ నెల వ తేదీనుండి, వ తేదీవరకు మహిళా క్రీడాకారుల (సాధకుల) విజయాల వారోత్సవాలు జరుగుతున్నాయని, రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ సంతోషి బుధవారం తెలిపారు. ఇందులో భాగముగా చిన్నారులు, విజయాలు సాధించిన కొంతమంది మహిళల వేసాధారణతో అలరించారు. బాక్సర్ మేరీకోమ్, బ్యాడ్మింటన్ సైనా నెహ్వాల్, రెస్టలింగ్ సాక్షి మాలిక్ సాధించిన విజయాలను, వారి విజయాతీరాలకు చేరుకోవటంలో పడిన కష్టం, దేశానికి తెచ్చిపెట్టిన కీర్తిని చిన్నారులచే వివరించారు. సైనా నెహ్వాల్ వేషధారిని ఉర్లం.ట్వింకిల్ పట్నాయక్ ఇచ్చిన ఉపన్యాసం అందరినీ ఆకట్టుకోగా, చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించి పాఠశాలకు, గురువులకు, తల్లితండ్రులకు, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తానని తెలిపింది. ఈ సందర్భంగా రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ సంతోషి మాట్లాడుతూ విద్యార్థులు, విద్యార్థి దశ నుండే చదువుతోపాటు, సేవాభావంతో ముందుకు వెళ్లాలని, క్రీడలలో రాణించాలని, విమెన్ అచీవర్స్ వీక్‌లో చిన్నారుల మనోభావాలు, ఆలోచనలు భేష్ అని కొనియాడుతూ, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, కష్టేఫలి సూత్రాన్ని పాటిస్తూ ఉన్నత చదువులు చదువుతూ, నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఐ రమేష్, డీన్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# అగనంపూడి ఫార్మాసిటీ కాలనీ విద్యుత్తు సమస్యలపై ఈఈ ఎస్ రామకృష్ణతో భేటీ అగనంపూడి టిడిపి నాయకులు





**విశాఖ, (రాజధాని వార్తలు):** కసింకోట సర్కిల్ ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణని జీవీఎంసీ 85 వార్డు టిడిపి అధ్యక్షులు కర్రీ దశంద్ర ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ విశాఖ పార్లమెంటరీ టిడిపి ఎస్సీ సెల్ కార్యదర్శి డొక్కా రమేష్ కలిసి అగనంపూడి ఫార్మాసిటీ విద్యుత్తు వినియోగదారుల సమస్యలపై చర్చించడం జరిగినది ఆదాని విద్యుత్తు స్మార్ట్ మీటర్లు వేసుకోమని ఒత్తిడి చేస్తున్నారని కావున వాటిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని అగనంపూడి పునరావాస కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎప్పటిలో వేస్తారని ఈ మధ్యకాలంలో ఆగనంపూడి పునరావాస కాలనీ శనవాడ గల్లవాని పాలెం ప్రాంతాల్లో రాత్రి 10 గంటల నుండి తెల్లవారుజామున 4గంటల వరకు విద్యుత్తు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారని నూతన విద్యుత్ తో కనెక్షన్లు ఇవ్వడంలో చాలా ఆంక్షలు పెడుతున్నారని గతంలో వలె విద్యుత్తు కనెక్షన్‌లో ప్రజలకి చేరువుగా అందజేయాలని కోరారు. ఫార్మా కాలనీలో నివాసకుల ఇండ్లకు విద్యుత్తు బిల్లు చెల్లిస్తే గొన్నవానిపాలెం పేరు మీద బిల్లులు చెల్లిస్తున్నారని ఇది రెండు మండలాల్లో సమస్యగా ఉన్నదని దాన్ని సరితూద్దాలని కోరారు. అగనంపూడి ఏరియా ఆసుపత్రికి సబ్ స్టేషన్ నుండి ప్రత్యేకమైన లైను ఇవ్వాలని అడగడం జరిగినది. అగనంపూడికి విద్యుత్ స్టాప్ తక్కువగా ఉన్నారని రెండు సంవత్సరాలగా అగనంపూడి ప్రాంతానికి సీనియర్ లైన్స్ ఇన్స్పెక్టర్ లేకపోవడం వల్ల స్థానిక విద్యుత్ సమస్యలు పరిష్కారంలో జాప్యం జరుగుతుందని కావున సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్‌ని వెయ్యవలసిందిగా అడిగారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్తు విద్యుత్తు వినియోగదాలకు మెరుగైన సేవలు అందించడమే మా ధ్యేయం అని అగనంపూడి పునరావాస కాలనీలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయుటకు ఎస్టిమేషన్ పంపించామని వీడ్కో దువ్వాలో రెండు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని వాటి నుండి అగనంపూడికి ఒక లైన్ తీసుకుంటామని అన్నారు. అగనంపూడి ఏరియా ఆసుపత్రి 100 పడకలుగా అభివృద్ధి చెందుతున్న వారికి ప్రత్యేకంగా సబ్ స్టేషన్ నుండి విద్యుత్తు లైను ఆసుపత్రికి ఇవ్వాలని వారు ప్రతిపదించిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. స్మార్ట్ మీటర్స్ సోలార్ మై త్వరలో అగనంపూడిలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని అన్నారు.

# మంత్రి కందులు దుర్గేష్‌ను కలిసిన శ్రీ శివశక్తి క్షేత్రం ఆలయ ధర్మకర్త కె ఎస్ ఆర్ శర్మ





**నాతవరం, (రాజధాని వార్తలు):** టూరిజం,సినిమాటోగ్రఫీ సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను బుధవారం కాకినాడలో నాతవరం మండలం చిక్కుడుపాలెం గ్రామంలో గల శ్రీ శివశక్తి క్షేత్రం ఆలయ ధర్మకర్త వైఎస్ఆర్ శర్మ కలవడం జరిగింది. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ మంత్రివర్యులు కందుల దుర్గేష్ గారిని శ్రీ శివశక్తి క్షేత్రంలో నిర్మించబోతున్న నవరత్న మండపాన్ని, కోటి రుద్రాక్షలతో నిర్మించబోయే రుద్రాక్ష శివలింగానికి శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించడం జరిగిందని అన్నారు. దానికి మంత్రివర్యులు స్పందిస్తూ తప్పకుండా శంకుస్థాపన కార్యక్రమానికి వస్తానని చెప్పడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శివశక్తి క్షేత్రం ఆలయ గౌరవ ధర్మకర్త పోలుపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఆదివాసుల మతం ఏమిటి

జనాభా గణన అధికారి మా ఇంటికి వచ్చిన ప్రతిసారి నన్ను 'మీ మతం ఏమిటి' అని అడుగుతారని ఎంతో ఆశతో ఎదురుచూసేవాణ్ణి. కానీ, నా ఆశను అడియాశ చేస్తూ నన్ను అడగకుండానే వారు నా మతాన్ని హిందువుగా నమోదు చేసేవారు. ఎందుకు మతం అడగలేదని వారితో అంటే, మీరు హిందువులు కదా అని ఆశ్చర్యంగా సమాధానం ఇచ్చేవారు. జనగణన సమయంలో ప్రతి ఆదివాసీ బిడ్డకు ఎదురయ్యే సంఘటన ఇది. కేంద్ర ప్రభుత్వం 2021లో జరగాల్సిన జనగణనను ఎట్టకేలకు 2027లో నిర్వహించడానికి నిర్ణయించింది. ఈ జనగణనలో ఒక ప్రత్యేకత ఏమంటే, ప్రతి పౌరుడి కులాన్ని నమోదు చేయటం. 1931 తరువాత కులాలవారీ జనగణనను నిలిపివేశారు. దీంతో పాటు ఆదివాసులను Other Religions and Persuasion (ORP) అనే మత కేటగిరీ నుంచి తొలగించి హిందూ మతంలో విలీనం చేయాలనే ప్రతిపాదన కూడా చర్చలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఆదివాసులు తమ మతాన్ని ప్రత్యేక మతంగా నమోదు చేసుకునే హక్కును కోల్పోతారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నిబంధనను ఉల్లంఘించడమే. ఈ నిబంధన - ప్రతి పౌరుడు తనకు ఇష్టమొచ్చిన మతాన్ని ఆచరించే హక్కును కల్పిస్తోంది. వందలాది మత సమూహాలు ఈ నిబంధనను ఉపయోగించుకుని ఓఆర్‌పీ కేటగిరీలో తమ మతాన్ని నమోదు చేసుకుంటున్నాయి. ఈ మధ్య కాలం నుంచే ఆదివాసులు తమను ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండ్‌తో ముందుకు వస్తున్నారు. ఈ డిమాండ్‌ను ఆదిలోనే తొక్కేయాలనే ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటికే ఆదివాసులను గుండుగుత్తగా హిందువులుగా నమోదు చేస్తున్నారు. వాస్తవానికి ఆదివాసుల మత విశ్వాసాలకూ హిందూ మతానికీ ఏ సంబంధమూ లేదు. బ్రిటిష్ వలస పాలనలో 1871లో మొదలైన జనగణనతోనే ఆదివాసుల మతం ప్రశ్నార్థకంగా మారింది. బ్రిటిష్ పాలకులకు ఎవరిని హిందువులుగా గుర్తించాలనే ప్రశ్న ఒక సవాలుగా మారింది. ఎందుకంటే అప్పటికి దేశంలో ఇస్లామేతర మతాలు తమ ప్రత్యేక ఉనికిని కలిగివుండేవి. మొదటగా ఇస్లామేతర మత విశ్వాసాలను బ్రిటిష్ వారు పెగానిజంగా పరిగణించారు. అంటే బహుదేవత ఆరాధన, ఆత్మలను, ప్రకృతిని పూజించటం, విగ్రహారాధన చేయడం. ఈ మతాచారాలకు 19వ శతాబ్దంలో హిందూ మతంగా నామకరణం చేశారు. ఇందులో బ్రిటిష్ పాలకులతో పాటు, మత సంస్కరణవాదులు కూడా ప్రధాన పాత్ర పోషించారు. ఇండియాలో పురాతనకాలం నుంచి అనేక ప్రాంతీయ మతాచరణలు ఉన్నాయి. అయితే దేశ స్థాయిలో బ్రాహ్మణ (వైదిక), శ్రమణ (బౌద్ధ, జైన) మతాలు ఉండేవి. ఇవి మళ్లీ అనేక శాఖలుగా విభజన అయ్యాయి. బ్రాహ్మణిజం ముఖ్యంగా వైష్ణవ, శైవంగా విభజన అయింది. శైవిజం బ్రాహ్మణేతర మతాచారాల నుంచి అభివృద్ధి చెందింది. హిందూ అనే పదాన్ని 11వ శతాబ్దం ముస్లిం చరిత్రకారుడు అల్బెరూనీ మొదటిసారి వాడారు. దీనిని సింధూ నది తూర్పున ఉన్న భౌగోళిక ప్రాంతాన్ని, ఆ ప్రజల సంస్కృతిని వర్ణించడానికి వాడారు. క్రమంగా ముస్లిమేతరులను హిందుస్థానీలుగా వర్ణించారు. అలా ఈ పదం ముస్లిమేతరుల భాష, సంస్కృతి, మతాచారాలను వర్ణించడానికి వాడారు. బ్రిటిష్ పాలకులు దేశంలోని విభిన్న మత విశ్వాసాల్ని ఒక తాటిపైకి తీసుకువచ్చి హిందూయిజంను ఏకరీతి మతంగా రూపొందించడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో అనేక ప్రశ్నలు ముందుకొచ్చాయి. ఒక మతాన్ని ఆధునిక మతంగా గుర్తించాలంటే అది మోనోథియిజం (ఒకే దేవుని విశ్వాసం) పునాది మీద నిర్మితమై ఉండాలి. హిందూయిజంలో కోట్లాది దేవతలున్నారనే భావన ఉంది. మరి ఇది ఆధునిక మతం ఎట్లా అవుతుందనే ప్రశ్న వచ్చింది. అప్పుడు రాజా రామ్మోహన్‌రాయ్ వేదాంత గ్రంథాల్లో మోనోథియిజం ఉందని ప్రచారం చేయడంతో ఇది ఆధునిక మతంగా గుర్తింపు పొందింది. హిందూయిజాన్ని ఒక మతంగా పరిగణించిన తరువాత ఎవరిని హిందువులుగా గుర్తించాలనే ప్రశ్న ముందుకొచ్చింది. ఏ కులం, సమూహం హిందూయిజంలో భాగం అనే ప్రశ్న అపరిష్కృతంగా ఉండిపోయింది. ఈ చర్చ ఆదివాసుల మతవిశ్వాసాలపై చాలా ప్రభావం చూపింది. ఎందుకంటే హిందూయిజానికి, ఆదివాసీ మతానికి మధ్య గీత క్రమంగా చాలా పలచనైంది. అనేక ఆదివాసీ దేవతలు హిందూ దేవతలుగా చలామణి అవుతున్నారు. ఆ దేవతలకు సంస్కృత పేర్లు పెట్టి, ఆ దేవతలను ఆదివాసీలకు కాకుండా చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఎవరిని హిందువులుగా గుర్తించాలనే చర్చ 19వ శతాబ్దం చివరి అంకంలో తారస్థాయికి చేరింది. దయానంద సరస్వతి హిందూ మతంలోని బహుళ అంధ మత ఆచరణలను తిరస్కరించి శుద్ధ ఆర్యవాదాన్ని ప్రచారం చేశారు. ఆయన దృష్టిలో నిజమైన హిందువులు కేవలం ఆర్యులు. కానీ 20వ శతాబ్దానికి వచ్చేసరికి మత రాజకీయాలు మొదలైనాయి. అప్పుడు మత గణాంకాలు రాజకీయ అధికారానికి మార్గమయ్యాయి. ఈ నేపథ్యంలోనే హిందూ మహాసభ నాయకుడు సావర్కర్ 1923లో "హిందూత్వ: హిందువు ఎవరు?" అనే రచనలో ఎవరు హిందువు అనే విషయాన్ని నిర్వచించారు. ఆయన ప్రకారం... ఎవరైతే భారతదేశాన్ని పితృభూమి, పుణ్యభూమిగా స్వీకరిస్తారో వారే హిందువులు. ఈ భావజాలం దేశంలో మతతత్వవాదానికి మరింత ఆజ్యం పోసింది. ఆ తరువాత ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు గోల్వాల్కర్ - ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు హిందూమతానికి శత్రువులని ప్రకటించారు. దీనికి విరుద్ధంగా మహాత్మాగాంధీ%-% హిందువు అంటే అన్ని మతాలను గౌరవించేవాడు అని నిర్వచించారు. ఈ మత రాజకీయాలు ఆదివాసీ సమాజాన్ని క్లిష్ట పరిస్థితిలోకి నెట్టివేశాయి.

# ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు "హడ్కో" వితరణ

### - రూ. 1,75,000 విలువ చేసే ఫర్నిచర్ అందజేత





**విజయనగరం, (రాజధాని వార్తలు):** హడ్కో విజయవాడ ప్రాంతీయ కార్యాలయం తమ సి.ఎస్.ఆర్ నిధుల నుంచి గజపతినగరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు 1,75,000 రూపాయల విలువ చేసే ఫర్నిచర్‌ను అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీసాల వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. 20 డ్యూయల్ బెంచీలు, 20 "ఎస్" టైప్ కుర్చీలు, 20 టేబుల్స్, 20 లైట్స్, 6 ఫ్యాన్స్ ఇందులో భాగంగా అందజేసినట్లు పేర్కొన్నారు. గణిత ఉపాధ్యాయులు ఎన్.కిరణ్ కుమార్ చొరవ వల్ల ఈ సామాగ్రి హడ్కో అధికారులు అందించారని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు మీసాల వెంకటేశ్వరరావు, గణిత ఉపాధ్యాయులు కిరణ్ కుమార్ కృషిని ఈ సందర్భంగా మండల విద్యా శాఖాధికారులు ఎస్.విమలమ్మ, బి.సాయి చక్రధర్ అభినందించారు. తమ అభ్యర్థనను పరిశీలించి విలువైన ఫర్నిచర్ అందజేసిన హడ్కో విజయవాడ ప్రాంతీయ కార్యాలయ అధిపతి బి.ఎస్.ఏ.మూర్తికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

# పెనుబల్లి, జొన్నవాడ మీదుగా ఆర్టీసి బస్సు ఏర్పాటు

### - ఎంపీటీసీ మెంబర్ చేవూరు వినయ్ నారాయణ

**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి.సురేష్ రెడ్డి సహకారంతో పెనుబల్లి, జొన్నవాడ మీదుగా నెల్లూరుకు నూతన ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయడం శుభ పరిమాణమని ఎంపీటీసీ మెంబర్ వినయ్ నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ శివ కేశవ్ యాదవ్ జెండా ఊపి బస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా పెనుబల్లి ఎంపీటీసీ మెంబర్ చేవూరు వినయ్ నారాయణ మాట్లాడుతూ పెనుబల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశా లకు సాల్మాన్ పురం, కాగులపాడు, బాపనపాడు, జొన్నవాడ, కొండ్లపూడి గ్రామాల నుండి వచ్చే విద్యార్థినీ విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు సమయానికి వెళ్లలేక, ప్రైవేట్ వాహనాలలో అధిక డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారనీ,అదేవిధంగా పవిత్ర పావన పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీ కామాక్షి తాయి అమ్మవారి దేవస్థానానికి వచ్చే భక్తులు చుట్టుపక్కల గ్రామాల నుండి నిత్యం వివిధ పనుల మీద నెల్లూరుకు వెళ్లే చిరుద్యోగులు, మహిళలు అధిక డబ్బులు చెల్లించి ప్రైవేటు వాహనాలలో ప్రయాణిస్తూ కొన్ని సార్లు ప్రమాదాల బారిన పడిన సంఘట నలు ఉన్నాయనీ, ఇదే విషయాన్ని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి ఆత్మకూరు డిపో మేనేజర్ ద్వారా బస్సు ఏర్పాటు చేయించడం జరిగిందనీ వెంటనే స్పందించి బస్సు ఏర్పాటు చేయించిన సన్నపురెడ్డి.సురేష్ రెడ్డికి మరియు ఆత్మకూరు డిపో మేనేజర్ శివ కేశవ్ యాదవ్‌కి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. పెనుబల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేలనూతల అనంత క్రిష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో అధిక డబ్బులు చెల్లించి ప్రైవేట్ వాహనాలలో పాఠశాలకు రాలేక చాలామంది విద్యార్థులు బడి మానేశారనీ, ఇప్పుడు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం వలన విద్యార్థులకు చాలా ఉపయోగకరమని తెలిపారు. స్కూల్ కమిటీ చైర్మన్ కోసూరు గోపి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో విద్యార్థినులకు ఉచితంగా ప్రయాణించే అవకాశం మరియు బస్సు పాస్ తీసుకునే అవకాశం ఉండడంతో విద్యార్థులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలనీ మరియు శ్రద్ధగా చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించి పెనుబల్లి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. టిడిపి పెనుబల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పల.మహీంద్ర మాట్లాడుతూ ఆగస్టు 15 నుండి కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నందున చుట్టు ప్రక్కల గ్రామాలలోని మహిళలకు చాలా మంచి అవకాశమనీ ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సురక్షితంగా గమ్యం చేరాలని తెలిపారు.

# దివ్యాంగులను ఆదుకుంటున్న విపిఆర్ ఫౌండేషన్

### - కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు 200 ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందించాం

### - దివ్యాంగులకు అండగా వుండాలన్నది ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సంకల్పం - జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 955 ట్రై సైకిళ్లు అందించాం - దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందచేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి





**కోవూరు, (రాజధాని వార్తలు):** విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాం గులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు పంపిణి చేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. నెల్లూరు మాగుంట లే ఔట్‌లోని విపిఆర్ నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని విడవలూరు, కొడవలూరు, కోవూరు మండలాలకు చెందిన నలుగురు దివ్యాంగులకు ఆమె ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు అండగా వుండాలన్నది ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సంకల్పమన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో దశల వారీగా 200 ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు పంపిణి చేసి నట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఇప్పటి వరకు 955 ట్రై సైకిళ్ళు అందించినట్లు ఆమె పేర్కొన్నారు. నడవలేక నిరాశ నిస్పృహలో వున్న దివ్యాంగులలో ఆత్మస్థై ర్యం నింపడం కోసమే ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఆమె వెల్లడించారు.

# ఆరు బాధ్యతలు ఒకే ఒక్కడు అల్పాహారం మానేసి సేవ - పేద విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యం







**మనుబోలు, (రాజధాని వార్తలు):** జిల్లా వ్యాప్తంగా సేవలు మండల కేంద్రమైన చిలుకూరుకు చెందిన పోతేగుంట మల్లికార్జున గత 12 సంవత్సరాలుగా పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రారంభించి విశ్రుతస్థాయిలో సేవలు అందిస్తున్నారు ముఖ్యంగా పేదలకు విద్య బట్టలు అందజేస్తూ తమ ట్రస్ట్‌కి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. గత 12 సంవత్సరాలుగా ఉదయం అల్పాహారం మానేసి ఆ డబ్బులను సేవ చేసేందుకు కేటాయిస్తున్నారు అతి పేద కుటుంబంలో పుట్టిన మల్లికార్జునుడు కేవలం పేదలకు సేవ చేయాలని ముఖ్య ఉద్దేశంతోనే ట్రస్టును ప్రారంభించారు తల్లిదండ్రులతో పాటు నలుగురు పిల్లలు ఆయనకు ఉన్న అంకితభావంతో సేవకే ఒకే ప్రాధాన్యతనిస్తూ సేవలను అందిస్తున్నారు స్పోర్ట్స్ అకాడమీ సమాజ సేవ బోర్ మెకానిక్‌గా చిరుద్యోగం మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దళిత సాహిత్యం ప్రధాన కార్యదర్శి ఇలా ఆరు రకాల బాధ్యతలను నిర్వహిస్తూ తన జీవితాన్ని సేవకే కేటాయిస్తున్నారు తన చిరుద్యో గంలో వచ్చిన జీతాన్ని సేవలకు ఖర్చు పెడుతూ సేవారంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు ముఖ్యంగా పేద ఎస్టి కాలనీలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకుని వారికి వేల రూపాయలు ఖర్చుపెట్టి దుస్తులను తమ ట్రస్టు ద్వారా అందిస్తున్నారు ఎవరైనా పేద పిల్లలు చదువుకునే స్థోమత లేకుంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పాఠశాలలో చేర్పించేందుకు చొరవ తీసుకుంటారు ఏళ్ల తరబడి సేవా రంగంలో దూసుకు వెళ్తున్న పోతేగుంట మల్లికార్జునుడిని అందరూ ప్రశంసలతో ముంచెత్తు తున్నారు ఎలాంటి లాభపక్ష లేకుండా నిస్వార్థ సేవ చేస్తున్న పోతేగుంటను అభినందించాల్సిందే ఇదిలా ఉండగా తమ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ సేవకు సంబంధించి ఏ పని అయినా తమకు అప్పగిస్తే వాటిని పూర్తి చేసే వరకు నిద్ర పోడు సేవా రంగంలో దూసుకెళ్తున్న పోతే గుంటను ప్రభుత్వాలు గుర్తించి వారిని ప్రోత్సహిస్తే మరింత ముందుకెళ్లే అవకాశం ఉంటుంది.

# జాయింట్ కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి భేటి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గత రబీ సీజన్లో ధాన్యం కొనుగోలు సందర్భంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. కోవూరు నియోజకవర్గానికి చెందిన వివిధ సమస్య లకు సంబంధించి ఆమె జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో భేటి అయ్యారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు చెల్లించాల్సిన 8 కోట్ల 36 లక్షల రూపాయల కమీషన్ చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని ఆమె జెసి దృష్టికి తెచ్చారు. 2021 వరదల సందర్భంగా కోవూరు, బుచ్చిరెడ్డి పాళెం మండలాలలోని రేషన్ షాపులలో తడిచిపోయిన బియ్యం, చక్కెర తాలూకు ఈపాస్ మిషన్లలో నమోదై వున్న స్టాక్ డేటాను సవరించవల్సిందిగా కోరారు.

# ఆధునీకరణ పార్కును ప్రారంభించిన మంత్రి పొంగూరు నారాయణ





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విజయదశమి నుంచి నెల్లూరు సిటీలో రోడ్లను స్వీపింగ్ మిషన్లతో శుభ్రం చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని తొమ్మిదో డివిజన్ ఎఫ్సీఐ కాలనీలో 60 లక్షల రూపాయలతో ఆధునికరించిన పార్క్, అదేవిధంగా 13 డివిజన్లో 15 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డితో కలిసి మంత్రి నారాయణ ప్రారంభించారు. పార్కులో చిన్నారులతో సరదాగా గడిపారు. అనంతరం మీడియాతో మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని చెత్త రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, విజయదశమి నుంచి నెల్లూరు నగరంలో అన్ని వార్డుల్లో మిషన్లతో రోడ్లను శుభ్రం చేయునట్లు చెప్పారు. ప్రతీ ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు.

ఆరు జిల్లాల్లో సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసామని.. లే అవుట్ ఎవరు వేసినా 10 శాతం స్థలం పార్కుకి వదలాలన్నారు..సిటీలో 56 స్థలాలను గుర్తించి పార్కులుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పార్కుల్లో పిల్లల కోలాహలం చూస్తే ఆనందంగా ఉందన్నారు.. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కి 165 కోట్లు మంజూరు చేసిన సీఎం కి కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన ప్రతీ హామీని ఖచ్చితంగా నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కమిషనర్ నందన్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అదేంటి పాప అలా షాక్ ఇచ్చావ్..!



టాలీవుడ్ సక్సెస్ ఫుల్ హీరోయిన్స్ లిస్ట్ లో సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ కూడా ఉంటుంది. అమ్మడు తెలుగులో చేసిన 3 సినిమాల్లో రెండు సూపర్ హిట్ అయ్యాయి. థర్డ్ సినిమాలో కూడా తన వరకు ఓకే అనిపించుకుంది. ఐతే సినిమా రిజల్ట్ అనేది కమర్షియల్ సక్సెస్ మీద ఆధారపడి ఉంటుంది కాబట్టి మృణాల్ ఠకూర్ ఖాతాలో ఒక ఫ్లాప్ పడినట్టే లెక్క. ప్రస్తుతం అమ్మడు అడివి శేష్ తో డెకాయిట్ సినిమా చేస్తుంది. ఆ సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో చేస్తూనే బాలీవుడ్‌లో ఆఫర్లు కొట్టేస్తుంది మృణాల్. ప్రస్తుతం ఆమె నటించిన సన్నాఫ్ సర్ధార్ 2 రిలీజ్ కి రెడీ అవుతుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో మృణాల్ పెళ్లిపై సంచలన వ్యాఖ్యలు చేసింది. తనకు కూడా త్వరగా పెళ్లి చేసుకోవాలి, పిల్లలని కనాలని ఉందని అన్నారు మృణాల్. తల్లి అవ్వాలని తానెప్పుడూ కలలు కంటానని ఆమె చెప్పింది.

ఐతే దానికి మాత్రం అసలు తొందరలేదని షాక్ ఇచ్చింది. ప్రస్తుతం తనస్ దృష్టి అంతా కూడా కెరీర్ మీద ఉందని.. ఇంకా చేయాలా చేయాలనుకుంటున్నా అందుకే పెళ్లి, పిల్లలు విషయాల గురించి ఇప్పుడు అసలు ఆలోచిం చట్లేదని అంటుంది మృణాల్. దాదాపు పెళ్లిపై హీరోయిన్స్ అంతా చెప్పే ఆన్సర్ ఇదే కదా అనొచ్చు. కానీ మృణాల్ ఠాకూర్ ఇప్పుడప్పుడే స్థిర పడాలనే ఆలోచన లేదు కాబట్టే తాను పెళ్లిని కొన్నాళ్లు దూరం పెడుతున్నా అని అంటుంది. పెళ్లైన హీరోయిన్స్ ఎంతైనా కెరీర్‌లో వెనకపడిపోతారు. దానికి చాలామంది హీరోయిన్స్‌ని ఎక్సాంపుల్‌గా తీసుకుంటాం. ఐతే మృణాల్ కూడా పెళ్లి, పిల్లలు అంటే కెరీర్‌కి ఎండ్ కార్డ్ పడినట్టే అని ఫిక్స్ అయ్యింది. అందుకే అలాంటి వాటికి కాస్త దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. మృణాల్ నిర్ణయం ఆమె ఫ్యాన్స్‌కి హ్యాపీ నెస్ తెస్తుంది. ఎందుకంటే పెళ్లైతే హీరోయిన్స్‌లో మార్పులు రావడమే కాదు సినిమాల్లో చేసే అవకాశం కూడా రాదు. అందుకే పెళ్లి విషయంలో మొత్తం హీరోయిన్స్ అంతా కూడా ఒకటే రాగం పాడతారు. మిగతా వారి సంగతి పక్కన పెడితే మృణాల్ మాత్రం అనుకున్నది సాధించే దాకా పెళ్లి చేసుకునేది లేదని బల్ల గుద్ది మరీ చెబుతుంది. సో ఆమెను వెండితెర మీద ఇలానే చూస్తూనే ఉండిపోవచ్చు.

# యాపిల్ పిల్ల స్పీడ్ పెంచుతుందా?



ఒకప్పుడు యాపిల్ పిల్లగా ఫ్యాన్స్‌లో మంచి క్రేజ్ అందుకున్న ముద్దుగుమ్మ హన్సిక మోత్వానీ గురించి అందరికీ తెలిసిందే. బాలనటిగా కెరీర్ ను స్టార్ట్ చేసిన అమ్మడు.. స్టార్ హీరో అల్లు అర్జున్ దేశముదురు మూవీతో టాలీవుడ్ లోకి వచ్చింది. డెబ్యూ మూవీతో మంచి హిట్ అందుకున్న ఆమె.. బబ్లీ బ్యూటీగా సూపర్ క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత అనేక మంది కుర్ర హీరోల సరసన నటించింది. తెలుగులో డెబ్యూ ఇచ్చిన హన్సిక.. ఆ తర్వాత బాలీవుడ్, కోలీవుడ్, శాండల్ వుడ్ చిత్రాల్లో నటించి మెప్పించింది. కానీ కొన్నేళ్లుగా తెలుగు, తమిళ సినిమాల్లో నటిస్తోంది. చివరగా తెలుగులో 105 మినిట్స్ మూవీలో సందడి చేసింది. అదే సమయంలో కోలీవుడ్‌లో మాత్రం వరుస ఆఫర్స్ అందుకుని దూసుకుపోతుందనే చెప్పాలి. ప్రస్తుతం రౌడీ బేబీ, మ్యాన్, గాంధారి సహా పలు సినిమాల్లో యాక్ట్ చేస్తున్న హన్సిక.. బాలీవుడ్‌లో లవ్ ఎఫైర్ మూవీలో నటిస్తోంది. అదే సమయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటోంది అమ్మడు. ఎప్పటికప్పుడు కొత్త పోస్టులు పెడుతోంది. రీల్స్‌తో పాటు డిజిటల్ కంటెంట్ పై ఫుల్ ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు మరిన్ని సినిమాలు లైన్‌లో పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. తన సినిమాల స్పీడ్‌ను ఫుల్‌గా పెంచనున్నట్లు తెలుస్తోంది. తెలుగులో కూడా సినిమాలు చేసేందుకు అవకాశాల కోసం వెయిట్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఏదేమైనా.. వరుస ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు హన్సిక మొగ్గు చూపుతున్నట్టు వినికిడి. అయితే రీసెంట్‌గా ఆమె పర్సనల్ లైఫ్‌లో ఇబ్బందులు ఉన్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తన భర్తతో విడాకులు తీసుకోనుందని ప్రచారం జరుగుతోంది. మూడేళ్ల క్రితం హన్సిక తన బెస్ట్ ఫ్రెండ్ భర్త సోహైల్ కతూరియాను పెళ్లి చేసుకుంది. అది కూడా ప్రేమాయణం నడిపి, ఇరు వర్గాల పెద్దలను ఒప్పించి మనువాడింది. కానీ కొంతకాలంగా భర్తకు దూరంగా ఉందని వార్తలు వస్తున్నాయి. త్వరలో విడాకులు కూడా తీసుకునే ఆలోచనలో ఉందని ఊహాగానాలు మాత్రం చక్కర్లు కొడుతున్నాయి. సోహైల్ ఇప్పటికే ఆ వార్తలను ఖండించినా.. హన్సిక మాత్రం రెస్పాండ్ అవ్వలేదు. అయితే విడాకుల విషయంలో నిజమెంతో తెలియకపోయినా.. కెరీర్ విషయంలో మాత్రం దూకుడు పెంచుతుందనేది మాత్రం నిజమట.

# శ్రీలీలకు కంబ్యాక్ ఇచ్చేది ఏ హీరో!



శ్రీలీలకు సరైన హిట్ పడి చాలా కాలమవుతుంది. 'భగవంత్ కేసరి' తర్వాత చాలా సినిమాలు చేసింది. కానీ అవేవి సక్సస్ తీరాన్ని చేరలేదు. మధ్యలో 'గుంటూరు కారం' యావరేజ్‌గా ఆడింది. హీరోయిన్‌గా నటించిన 'ఆదికేశవ', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్', 'రాబిన్ హుడ్', లేటెస్ట్ రిలీజ్ 'జూనియర్' అన్ని బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిన సినిమాలే. చివరికి శ్రీలీల పరిస్థితి ఎలా అయిందంటే? ఆమె సినిమాలు ఎప్పుడు రిలీజ్ అవుతున్నాయో? ఎప్పుడు పోతున్నాయో ? కూడా తెలియని పరిస్థితుల్లోకి వెళ్లిపోయింది. దానికి తోడు ఈ మధ్య కాలంలో టాలీవుడ్ అవకాశాల్ని కాదని ఇతర భాషలపై దృష్టి పెడుతోంది. ఇప్పటికే రెండు తెలుగు సినిమా ఛాన్సులు వదులుకున్న సంగతి తెలిసిందే. దీంతో శ్రీలీల స్ట్రాంగ్ కంబ్యాక్ కోసం అంతే ఆసక్తిగా ఎదురు చూస్తుంది. మరి ఆ సినిమా ఏది అవుతుందో చూడాలి. ప్రస్తుతం లైనప్‌లో మాత్రం కొన్ని సినిమాలు కనిపిస్తున్నాయి. మాస్ రాజా రవితేజ హీరోగా 'మాస్ జాతర' తెరకెక్కుతోంది. ఇందులో శ్రీలీల హీరోయిన్. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్'లోనూ ఈ బ్యూటీనే నటిస్తోంది. అటు కోలీవుడ్‌లో శివకార్తికేయన్ నటిస్తోన్న 'పరాశక్తి' లోనూ నటిస్తోంది. బాలీవుడ్‌లో కార్తిక్ ఆర్యన్‌తోనూ ఓ సినిమా చేస్తోంది. అదే ఆషికి 3. ఇవన్నీ ఆన్ సెట్స్‌లో ఉన్న చిత్రాలు. ఈ చిత్రాలపై భారీ అంచనాలున్నాయి. మరి వీటిలో ఏ సినిమాతో హిట్ అందుకుని స్ట్రాంగ్‌గా కంబ్యాక్ అవుతుందో చూడాలి. ముఖ్యం గా శ్రీలీల తెలుగు కంటే తమిళ్, హిందీ భాషలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టి పని చేస్తోంది. ఆ రెండు భాషల్లో చేస్తోన్న సినిమాలు మంచి విజయం సాధించాలని ఆశిస్తుంది.

ప్రముఖంగా 'ఆషీకీ3' పై చాలా ఆశలు పెట్టు కుంది. ఈ సినిమాతో హిట్ అందుకుంటే? రొమాంటిక్ స్టార్‌గా ముద్ర పడుతుంది.

యువతలో క్రేజ్ రెట్టింపు అవుతుంది. బాలీవుడ్‌లో ఇంకా మంచి అవకాశాలు అందుకేనే అవకాశం ఉంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్రకు నటనకు ఆస్కారం ఉంది. ఇలా ఇన్ని ఆశలతో 'ఆషీకి 3' సక్సస్ కోసం ఎదురు చూస్తోంది.

# 'కబీర్‌సింగ్'ని మించి బిగ్ హిట్



మోహిత్ సూరి దర్శకత్వం వహించిన సైయారా బాక్సాఫీస్ వద్ద సంచలన ఓపెనింగులను సాధించిన సంగతి తెలిసిందే. అహాన్ పాండే –అనీత్ పడ్డా ఈ చిత్రంలో జంటగా నటించారు. ఈ చిత్రం విడుదలకు ముందు అంచనాలు తక్కువగా ఉన్నా పాజిటివ్ టాక్ కారణంగా అద్భుత వసూళ్లను సాధిస్తోంది. డే –1 రూ. 21 కోట్లకు పైగా ఓపెనింగ్ సాధించిన ఈ చిత్రం రెండో రోజు (శనివారం నాడు) వసూళ్లలో మరింత మెరుగైన వసూళ్లను సాధించింది. ఆదివారం నాడు అంచనాలను సులభంగా అధిగమించి రూ. 35 కోట్లు వసూలు చేసి రూ. 82 కోట్ల నికర వారాంతపు వసూళ్లను సాధించింది. సగటు టిక్కెట్లు ప్రారంభం రోజు కంటే 20 శాతం తక్కువగా ఉండటం కూడా ఈ సినిమాకి కలిసొచ్చింది. మొదటి నాలుగు రోజులలో 100 కోట్లు వసూలు చేసిన ఈ చిత్రం, ఐదు రోజులకు 130 కోట్లు వసూలు చేసిందని బాక్సాఫీస్ ఇండియా పేర్కొంది. అయితే కొత్త కుర్రాళ్లు నటించిన 'సైయారా' వసూళ్లను పెద్ద స్టార్లు షాహిద్ కపూర్– కియరా జంటగా నటించిన కబీర్ సింగ్‌తో పోల్చి చూడటం ఆసక్తిని కలిగిస్తోంది. కబీర్ సింగ్ భారతదేశంలో బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ స్థాయి వసూళ్లు సాధించిన చివరి ప్రేమకథా చిత్రం. అందువల్ల ఈ చిత్రంతో పోల్చడం చూస్తుంటే, సైయారా సృష్టిస్తున్న ప్రభంజనాన్ని అర్థం చేసుకోవచ్చు. కబీర్ సింగ్ ఆరు సంవత్సరాల క్రితం విడుదల కాగా, ఇంతకాలానికి అంతకుమించిన బ్లాక్ బస్టర్ ప్రేమకథా చిత్రాన్ని మోహిత్ అందించగలిగారు. సైయారా వర్సెస్ కబీర్ సింగ్ రోజువారీ వసూళ్లను పరిశీలిస్తే....డే వన్‌లో సైయారా రూ 21.25 కోట్లు వసూలు చేయగా, కబీర్ సింగ్ రూ 20.25 కోట్లు వసూలు చేసింది. డే2 సైయారా రూ 25.75 కోట్లు కలెక్ట్ చేయగా, కబీర్ సింగ్ రూ 22.75 కోట్లు వసూలు చేసింది. మూడోరోజు సైయారా 35 కోట్లు, కబీర్ సింగ్ రూ 28 కోట్లు వసూలు చేసాయి. డే 4 సైయారా వసూళ్లు రూ 24 కోట్లు కోగా కబీర్ సింగ్ రూ 17.25 కోట్లు వసూలు చేసింది. ఐదో రోజు సైయారా రూ 24.50 కోట్లు, కబీర్ సింగ్ రూ 16.50 కోట్లు వసూలు చేసాయి. సైయారా వసూళ్లు సోమవారం తర్వాతా స్థిరంగా నమోదవుతున్నాయని ట్రేడ్ చెబుతోంది.

సైయారా ఐదు రోజులకు మొత్తం రూ 131 కోట్లు నికర వసూళ్లను సాధించగా, కబీర్ సింగ్ కేవలం 105కోట్ల నికర వసూళ్లను మాత్రమే సాధించింది.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి

**- అడుగడుగునా మంగళ హారతులతో మహిళల అపూర్వ స్వాగతం - సూపర్ సిక్స్‌లో 80 శాతం హామీలు అమలు చేసాం - ఉత్సాహంగా పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు - అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కార్యకర్తలు కృషి చేయాలి - మంత్రి లోకేష్ ప్రవేశపెట్టిన ఒన్ క్లాస్ ఒన్ టీచర్ విధానంతో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అయింది**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు చేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మైపాడు (కృష్ణాపురం) కొరుటూరు (కొలి మిట్ల పాళెం) సోమరాజుపల్లి, మొత్తలు గ్రామాలలో పర్యటించారు. స్థానిక టిడిపి మరియు కార్యకర్తలతో కలిసి ఇల్లిల్లూ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం సందర్భంగా పేదలకు ఇళ్ళు, ఇళ్ల స్థలాలు లేని పరిస్థితిని చూశానని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పేదల సొంతింటి కల సాకారం చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రాగానే రైతులకు ప్రయోజనం చేకూర్చే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేసిన పెన్షన్ పెంపు, దీపం 2, మత్స్యకార సేవలో, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఎన్నికల సందర్భంగా చేసిన సూపర్ సిక్స్ హామీలలో 80 శాతం అమలు చేసామన్నారు. గంగపుత్రులు గతంలో 10 వేలు వున్న వేట నిషేధ భృతిని కూటమి ప్రభుత్వం 20 వేలకు పెంచి వేట నిషేధ కాలంలో అందచేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఫిషరీస్ అధికారుతో మాట్లాడి అర్హులైవుండి మత్స్యకార సేవలో రాని వారిని గుర్తించి వారికి ప్రభుత్వ పరిహారం ఇప్పించేందుకు కృషి చేయాలని నాయకులను ఆదేశించారు. వారిని సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా తనను అమ్మలా, అక్కలా, ఆదరించి తన విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ యిచ్చారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందిచడంతో పాటు ఆగస్ట్ 15 వ తేదీ నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించబోతున్నట్టు ఆమె వెల్లడించారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి వాగ్దానం అమలు చేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రజలకు హామీ యిచ్చారు. భావితరాల బంగారు భవిషత్తు కోసం విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డొక్కా సీతమ్మ మధ్యాన భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనంతో పాటు సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరిట స్టడీ కిట్స్ అందిస్తున్నారన్నారు. ఒన్ క్లాస్ ఒన్ విధానం ద్వారా ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అయిందన్నారు. 15 ఆర్థిక సంఘ నిధుల ద్వారా స్థానిక సంస్థలు బలోపేతమై గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు.

ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, ఉచిత ఇసుక ద్వారా భవన నిర్మాణ కార్మికులకు జరుగుతున్న ప్రయోజనాలను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రస్తావించారు. రానున్న నాలుగేళ్లలో కోవూరు నియోజకవర్గంలో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, లాంటి మౌలిక సదుపాయాలతో పాటు పేదల సొంతింటి కల సాకారం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరు పేట మండల టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడు, చెంచు కిషోర్ యాదవ్, పి ఎల్ రావు, చెన్నయ్య, చంద్రమోహన్ రెడ్డి, ఈదూరు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం చేస్తున్న అరెస్టులకు భయపడం

**- వైయస్సార్ టియుసి జిల్లా అధ్యక్షులు బుంది గులపాడు జయ కుమార్ రెడ్డి**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులపై భయపడం, బెదరం అని వైయస్సార్ టి యుసి జిల్లా అధ్యక్షులు బొందిగులపాడు జయకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు జయకుమార్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజంపేట పార్లమెంట్ సభ్యులు మరియు ప్రాంతీయ సమన్వయకర్త మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడంపై ధ్వజమెత్తారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ఎవరు భయపడరని మీరు ఎంత అనగదొక్కాలని చూస్తే అంత కసిగా పైకి లేస్తామని అన్నారు. ఈ సందర్భంగా జయ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలనను, సంక్షేమాన్ని గాలికి వదిలేసింది అని తెలిపారు. కక్షపూరిత రాజకీయాలే పరమావధిగా పరిపాలిస్తుంది అని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలుపై ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీ నేతలు అందరిని అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసి అనగదొక్కాలని చూస్తోంది, సంవత్సర కాలంగా ప్రతిపక్ష పార్టీలో బలంగా ఉన్న ప్రతి నాయకుడి పై ఏదో ఒక కేసు పెట్టి జైల్లో పెట్టాలని శతవిధాల ప్రయత్నిస్తుంది అని తెలిపారు. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్టు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్దేశపూర్వక, కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే అని తెలిపారు. గత ప్రభుత్వంలో మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించి వచ్చిన ఆదాయాన్ని రాష్ట్ర ఖజానాకే జమ చేయడం జరిగింది అని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వ చేతుల మీదుగా పారదర్శంగా జరిగిన మద్యం అమ్మకాలలో ఒక పార్లమెంట్ సభ్యుడిని నిధులుగా చేర్చి కేసు పెట్టి వేధించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి పెద్దిరెడ్డి కుటుంబంపై ఉన్న ఈర్ష ద్వేషం కారణంగానే మిథున రెడ్డి అరెస్టు జరిగింది అని తెలిపారు. ఒకే జిల్లాలో ఉంటూ ముఖ్యమంత్రిగా పని చేసిన తనకంటే పెద్దిరెడ్డి కుటుంబానికి జిల్లాలో ఎక్కువ ఆదరణ లభించడమే చంద్రబాబు ఈర్ష ద్వేషానికి కారణం. ఆ ఈర్ష్య, దేశం కారణంగానే అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఏ విధంగా ఇబ్బందులు పెట్టాలో అన్ని రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారు. ఎటువంటి ఆధారాలు లేని అక్రమ మద్యం స్కాంలో మిధున రెడ్డిని కావాలని ఇరికించారు, అలివి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలు నెరవేర్చమని ప్రశ్నించిన మా పార్టీ వారిపై అక్రమ కేసులు పెట్టడం జరుగుతుంది, మిమ్మల్ని నమ్మి గెలిపించిన ప్రజలకు హామీలు అమలుపరిచి ప్రజల మన్ననలను పొందాల్సిన కూటమి ప్రభుత్వం ప్రజలను పాలన, సంక్షేమం నుండి దృష్టి మరల్చేందుకు అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తుంది. కూటమి ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం అనే సూత్రంతో పనిచేస్తుంది అని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవు, మహిళలకు రక్షణ లేదు. మహిళలపై రోజుకు ఒక అరాచకం జరుగుతున్న పట్టించుకున్న పాపాన పోలేదు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు కానీ ఇంతవరకు వారిని పట్టించుకోలేదు. మహిళలు తమకు ఆడబిడ్డ నిధి ఇవ్వకపోయినా పర్వాలేదు కానీ మాకు రక్షణ కల్పించండి అని వేడుకునే స్థితిలో ఉన్నారు. వారం రోజుల క్రితం మాజీ మంత్రి మరియు నగిరి మాజీ శాసనసభ్యులు రోజా పై కూడా తెలుగుదేశం శాసనసభ్యులు భాను ప్రకాష్ మహిళ అని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో దూషించడం జరిగింది. ఒక మంత్రిగా, శాసనసభ్యులుగా, మంచి నటిగా ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగిన రోజా పరిస్థితి అలా ఉంటే రాష్ట్రంలో సాధారణ మహిళలకు తెలుగుదేశం నాయకులు తెలుసుకోవచ్చు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలోనే ఒక మహిళను చెట్టుకు కట్టేసి కొడుతుంటే అడిగేవారే లేరు. ఏ విషయాలలోనూ పాలన పట్టించుకోకుండా, సంక్షేమాన్ని అందించకుండా దాని గురించి ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తామంటూ ప్రతిపక్ష నాయకుల్ని అరెస్టు చేసి జైలుకు పంపిస్తూ భయపెట్టాలని చూస్తున్నారు. ఇలాంటి బెదిరింపులకి వైఎస్ఆర్సిపి కార్యకర్తలు గాని, నాయకులు గాని, జగన్మోహన్ రెడ్డి అభిమానులు కానీ ఏమాత్రం భయపడరు. ఈ సమావేశంలో వైయస్సార్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ ఎన్నికలలో గెలిచిన ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పరిపాలనపై దృష్టి పెట్టాలి. కానీ ఈ రాష్ట్రంలో కేవలం కక్షపారత రాజకీయాల పైన మాత్రమే ప్రభుత్వం దృష్టి సారించింది. మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి మద్యం పాలసీ పై ప్రభుత్వ నియంత్రణలో ఉంచి అధికారుల ఆధ్వర్యంలో పారదర్శకంగా మద్యం అమ్మకాలు చేశారు. మద్యం షాపులను తగ్గించి, మద్యం అమ్మకాలకు ఒక సమయాన్ని నిర్దేశించి, విచ్చలవిడి అమ్మకాలు జరక్కుండా, మైనర్లకు మద్యం అందకుండా, ఒక క్రమ పద్ధతిలో మద్యపానాన్ని నియంత్రించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ నిర్వహించిన మద్యం పాలసీని దేశం మొత్తం మెచ్చుకుంది. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ వైయస్ఆర్ టి యు సి అధ్యక్షులు నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

# హామీల అమలు సాధ్యం కాదంటున్నారు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి, ఇప్పుడు ఆ హామీలు సాధ్యం కాదంటూ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు కొత్త భాష్యం చెబుతున్నారని జడ్పిటిసి గార తౌడు అన్నారు. బాబు షూరిటీ –మోసం గ్యారంటీ కార్యక్రమం మండలంలోని సీతారాంపురం గ్రామంలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కుటమి ప్రభుత్వ మోసకారి హామీలను వివరిస్తూ దీనివల్ల ప్రజలకు ఆర్థికంగా జరిగిన నష్టాలను వివరించారు. ఆడబిడ్డ నిధి పథకానికి సంబంధించి మంత్రి అచ్చం నాయుడు మంగళవారం చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, వైకాపా నేతలు బెల్లాన త్రినాధరావు, కె.పైడుపునాయుడు, కరణం ఆదినారాయణ, కనకల సుబ్రహ్మణ్యం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యకు పరిష్కారం

**- బుచ్చిరెడ్డిపాలెం నుండి జొన్నవాడ మీదుగా నెల్లూరుకు నూతన బస్సు - హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు ఉపాధ్యాయులు**




**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి జొన్నవాడ మీదుగా నెల్లూరుకు నూతన బస్సును ఏర్పాటు చేయాలని ఇటీవల ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డికి గ్రామస్తులు విన్నవించారు. దీంతో నూతన ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు డిపో మేనేజర్ శివ కేశవ్ యాదవ్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. తొలుతా జొన్న వాడ ఆలయం వద్ద బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి విన్నపం మేరకు విద్యార్థుల సౌకర్యార్థం బస్సును ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఎస్ పేట నుండి బుచ్చి, జొన్నవాడ మీదుగా నెల్లూరుకు వెళుతుందన్నారు. విద్యార్థులకు పాఠశాలకు వెళ్లే సమయాలకు బస్సు వస్తుంది అన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బస్సు పాస్ తీసుకోవాలని సూచించారు.

# విపిఆర్ కృషితో సాకారం కానున్న కార్మికుల కల

**- కార్మికుల సంక్షేమం, భరోసా ఇచ్చేలా ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం - టెండర్లు ఆహ్వానించాలని కేంద్రమంత్రికి ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తి - అన్ని అనుమతులు, స్థల సేకరణ పూర్తయ్యాయని వెల్లడి - హాస్పిటల్ పూర్తయితే వేలాది మంది అసంఘటిత రంగ కార్మికులకు ఎంతో మేలు**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా పరిధిలో కార్మికుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా వారికి భరోసానిచ్చేలా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. నెల్లూరు జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని గత ఏడాది కాలంగా కేంద్ర కార్మిక మరియు ఉపాధి శాఖ, మరియు యువజన వ్యవ హారాలు మరియు క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయని, ఈఎస్ఐసి డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్‌ను పలు దఫాలుగా కలిసిన ఎంపీ వేమిరెడ్డి..బుధవారం కేంద్ర మంత్రిని మరోసారి కలిశారు. హాస్పిటల్, క్వార్టర్స్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో మనసుఖ్ మాండవీయను కలిసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్మాణానికి సంబంధించి అన్ని అనుమతులను, స్థల పరిశీలన పూర్తయిన వివరాలను మంత్రికి వివరించారు. నెల్లూరులో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి మరియు సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం కోసం టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని ఎంపీ వేమిరెడ్డి కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. ఆసుపత్రికి ఇప్పటికే తగిన స్థలాన్ని గుర్తించామని, అదనంగా, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం కోసం 1 ఎకరా భూమిని కేటాయించినట్లు తెలిపారు. ఈ స్థలాలు నెల్లూరు జిల్లా ప్రధాన కార్యాలయంలో ఉన్నాయని, సంబంధిత అధికారుల తనిఖీలు కూడా సక్రమంగా పూర్తయ్యాయన్నారు. నెల్లూరులో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు వల్ల శ్రామిక వర్గ జనాభాకు, ముఖ్యంగా ఈ ప్రాంతంలో అసంఘటిత రంగంలో పెద్ద సంఖ్యలో పనిచేస్తున్న కార్మికులకు ఒక వరం అవుతుందని, ఈ సౌకర్యం నాణ్యమైన వైద్య సంరక్షణను పొందేందుకు శ్రామిక శక్తి మరియు వారి కుటుంబాల మొత్తం సంక్షేమాన్ని మెరుగుపరిచేందుకు ఎంతో దోహదపడుతుందని వెల్లడించారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని, ఆసుపత్రి, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణానికి టెండర్లు పిలిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తులను పరిశీలించిన కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి హాస్పిటల్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారు ఉమాజీ ఎమ్మెల్యే : బొత్స అప్పలనర్సయ్య





**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** టిడిపి – జనసేన – బిజెపి కూటమి అమలు కానీ అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చారని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. బొండపల్లి గ్రామంలో గల నాయుడు ఫంక్షన్ హాల్లో బుధవారం సాయంత్రం వైకాపా మండల విస్తృతస్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే బొత్స ఆధ్వర్యంలో జరిగింది. జగన్ చేసిన సంక్షేమం అభివృద్ధి కంటే ఎక్కువ చేస్తామని అధికారంలోకి వచ్చిన బాబు ఆ హామీలను తుంగలో తొక్కారని ఆయన మండిపడ్డారు. హామీలను అమలు చేయడానికి సమయం పట్టవచ్చు కానీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేసాను అనడమే బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం చేపట్టడానికి ముఖ్య కారణమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం జగన్ పాలనలో అభివృద్ధిని, బాబు పాలనలోని మోసాన్ని బట్టబయలు చేస్తుందన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ల హామీ మాత్రమే నెరవేర్చిందని, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీలు ఎప్పుడు అమలుకు నోచుకుంటాయని మాజీ ఎమ్మెల్యే బొత్స ప్రశ్నించారు. తల్లికి వందనం దీపం పథకాలు అరాకొరగా ఇచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. స్వతంత్ర భారతావనిలో రాష్ట్రంలో 16 మెడికల్ కళాశాలలు ఉంటే, జగన్ పాలనలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టడం గర్వకారణం అన్నారు. శాసనసభ సాక్షిగా జిల్లాకు మెడికల్ కాలేజీ ఇస్తానన్న బాబు హామీ ఏమైంది అని ప్రశ్నించారు.ఆడబిడ్డ నీది ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలి అన్న మంత్రి అచ్చం నాయుడుకు హామీ ఇచ్చే ముందు ఆ విషయం గుర్తులేదా అన్ని అన్నారు. ఒక్క విద్యా రంగానికే 56 వేల కోట్ల రూపాయలు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదే అని ఆయన కొనియాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో జగన్ ప్రజల భూములను లాగేసుకుంటున్నాడని అన్న బాబు ఇప్పుడు అదే పథకాన్ని అమలు చేయట్లేదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ కిలో బియ్యం రెండు రూపాయలకే ఇస్తే చంద్రబాబు తెలుగుదేశం పార్టీ దాన్ని ఐదున్నర రూపాయలు చేసిందని ఆయన గుర్తు చేశారు. టిడిపి అమలు చేస్తున్న పథకాలన్నీ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వేనని ఈ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని ఆయన అన్నారు. 1,42 వేల కోట్లు అప్పులు చేసి చంద్రబాబు ఎందుకు బటన్ నొక్కలేకపోయారని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గ మంత్రి కేంద్ర ప్రభుత్వం నిధులు తప్ప, నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వి.ప్రభుజి, మండల పార్టీ అధ్యక్షులు చిన్నం నాయుడు, ఎంపీపీ చలంనాయుడు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, జిల్లా కార్యవర్గ సభ్యులు మూకల చలం నాయుడు, పల్లి రఘు, సతీష్, మండల యువజన విభాగం అధ్యక్షులు జగదీష్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నా విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం

**- కార్యకర్తలు @ 50 కోట్లు - నమ్ముకున్న కార్యకర్తకు సొంత నిధి ద్వారా ఏటా రూ. 10 కోట్లు**

**- కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా 24 గంటలు అందుబాటులో ఉంటా : మంత్రి పొంగూరు నారాయణ**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పార్టీని నమ్ముకొని.. సార్వత్రిక ఎన్నికల్లో తన వెంట నడిచి పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.. సొంత నిధుల నుండి కార్యకర్తలకు ఏటా 10 కోట్లు లెక్కన 5 సంవత్సరాలకు 50 కోట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.. అందులో భాగంగా కార్యకర్తల సంక్షేమ నిధి నుండి బుధవారం 175 మంది 45 లక్షలు రూపాయల చెక్కులను మంత్రి నారా యణ సతీమణి రమాదేవితో కలిసి గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా యణ మీడియాతో మాట్లాడారు నగర సమగ్రాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్నామని..ఎండ్ టు ఎండ్ రోడ్ల పనులు సెరవేగంగా జరుగుతున్నాయన్నారు..స్వీపింగ్ మిషన్‌లతోనే ఇకపై రోడ్లు శుభ్రం చేస్తామన్నారు..28 స్వీపింగ్ మిషన్‌లను కార్పొరేషన్‌కి ఇవ్వటం జరిగిందని..సిటీలో 5 వేల మందికి ఇంటిపట్టాలు ఇప్పించాలన్నదే నా లక్ష్యం అని తెలిపారు..మంచినీటి ప్రాజెక్టుకు 120 కోట్లు మంజూరు అయ్యాయని..డిసెంబర్ కల్లా సంగం బ్యారేజ్ నుంచి ప్రతీ ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు..డ్రైన్ల మరమ్మత్తులు, కొత్త డ్రైన్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయని..50 కోట్లతో మేజర్ కెనాల్స్ రివిట్ మెంట్ పనులు ప్రారంభిస్తున్నామని..అభివృద్ధి పనుల్లో ఆక్రమణ దారులకు ఎవరూ ఒత్తాసు పలకొద్దని మంత్రి తెలిపారు.. ఖజానా ఖాళీ అయినా అభివృద్ధి కొనసాగిస్తున్నామన్నారు..ఓపిక పడితే హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని మంత్రి వెల్లడించారు.. అనంతరం మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి మాట్లాడారు మంత్రి నారాయణ సార్ మాటల మనిషి కాదని..చేసింది చెప్పుకొనే వ్యక్తి కూడా కాదని.. అనుకున్న పని చేసి తీరుతారని మంత్రి సతీమణి రమాదేవి తెలిపారు..విమర్శలను అభివృ ద్ధితో తిప్పికొడతారని..ఆంధ్రకి 5 స్వచ్ఛ అవార్డులు సాధించిన ఘనత మంత్రి నారాయణ సార్కే దక్కుతుందన్నారు.. నారా యణ హాస్పిటల్స్‌లో చికిత్సపై వచ్చే కార్యకర్తలకి అండగా నిలుస్తున్నారని..వీఆర్‌సిని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దారని..భవిష్యత్తులో మరిన్ని స్కూల్స్‌ని అదే తరహాలో ఆధునీకరించబోతున్నారని ఆమె తెలిపారు..పిల్లా, పెద్దా ఆరోగ్యం కోసం అలోచించి అడుగులు వేస్తున్నారని..పార్కులను ఆధునీకరించి అన్ని హంగులతో సిద్ధం చేస్తున్నామన్నారు..నారాయణ సార్ ఆధ్వర్యంలో మరెన్నో అభివృద్ధి పనులు జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి సతీమణి రమాదేవి తెలిపారు..అనంతరం మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ నారాయణ అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే నారాయణ అని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తల్లాపాక అనురాధ అన్నారు.. సిటీ నియోజక వర్గ స్లోగన్ ఇదే అని..నారాయణ మంత్రమే అభివృద్ధి తంత్రం అన్నారు.

నా 30 ఏళ్ల రాజకీయ జీవితంలో నారాయణ సార్ లాంటి నేతను ఇప్పటివరకు నా జీవిత చరిత్రలో చూడలేదన్నారు.. ఏడాదికి 10 కోట్ల సొంత నిధులతో నారాయణ సార్ దంపతులు కార్యకర్తలకు సహాయం అందిస్తున్నారని..నారాయణ సార్‌కి 2029 ఎన్నికల్లో లక్షా మెజారిటీ ఇచ్చి కృతజ్ఞత తెలుపుదామన్నారు..నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామన్నారు..ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జిలు, డివిజన్ ప్రెసిడెంట్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఈనెల 27వ తేదీన హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో శాస్త్రీయ జానపద నృత్య ఉత్సవం, హరివిల్లు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి సౌజన్యంతో హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ ఆదివారం సాయంత్రం నెల్లూరు టౌన్ హాల్‌లో "శాస్త్రీయ జానపద నృత్యోత్సవం మరియు హరివిల్లు ప్రతిభా పురస్కారాల ప్రధాన ఉత్సవం" కార్యక్రమం జరుగుతుందని 25 కళా సంఘాల అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి, మరియు హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు దోర్నాల హరిబాబులు పేర్కొన్నారు.. బుధవారం నాడు 25 కళా సంఘాల ఛాంబర్ లో జరిగిన కార్యక్రమంలో 25 కళా సంఘాల అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు దోర్నాల హరిబాబు, అమీర్ ఆర్ట్ అకాడమీ అధినేత డాక్టర్ షేక్ అమీర్ జాన్, హరివిల్లు సభ్యులు వనారస లక్ష్మీకాంత్ బాబు, దోర్నాల కామేశ్వరరావు తదితరులు కార్యక్రమానికి సంబంధించిన బ్రోచరును ఆవిష్కరించారు. శాస్త్రీయ జానపద నృత్య ఉత్సవ కార్యక్రమంలో శ్రీమతి సురభి గాయత్రి గారి శిష్య బృందం, దేగల సాంబశివరావు శిష్య బృందం, శ్రీమతి పాల జ్యోత్స్న గారి శిష్య బృందం, శిరీషాలత శిష్య బృందం శాస్త్రీయ జానపద నృత్య ప్రదర్శనలు చేస్తారని పేర్కొన్నారు. హరివిల్లు ప్రతిభా పురస్కారాల్లో భాగంగా ఇటీవల అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుండి డాక్టరేట్లు పొందిన హైటెక్ ఫార్మా అధినేత డాక్టర్ ఎన్వి రమణ రెడ్డి, ఎస్వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందే శ్రీనివాసులకు ఆత్మీయ సత్కారం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన నెల్లూరు ప్రముఖులైన విశాలాక్షి వృద్ధాశ్రమం అధినేత డాక్టర్ కోసూరు రత్నంకి, అమీర్ ఆర్ట్ అకాడమీ అధినేత, గిన్నిస్ బుక్ రికార్డు హోల్డర్ డాక్టర్ షేక్ అమీర్ జాన్‌కి, నృత్య గురువులు సురభి గాయత్రికి, దేగల సాంబశివరావుకి, పాల జ్యోత్స్నకి, కట్టు శిరీష లతకి ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.



# ఆత్మీయ సమావేశంలో కోవూరు టీడీపీ నేతలు

**కోవూరు, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలను కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధి సంక్షేమములను తొలి అడుగు ప్రచారంలో వివరించారు. బుధవారం ఇంటింటా ప్రచారం ముగింపు సందర్భంగా నెల్లూరులోని వీపీర్ కన్వెన్షన్ హాల్ నందు జరిగిన సుపరిపాలనలో తొలి అడుగుఆత్మీయ సమ్మేళనంలో కోవూరు నియోజకవర్గం స్థాయి టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానం మహోత్సవ చైర్మన్, కోవూరు మండలం టీడీపీ అధ్యక్షులు కొల్లా సుధాకర్ రెడ్డి, తిరుమూరు అశోక్ రెడ్డి, మాజీ కోవూరు మండలాధ్యక్షులు ఇంత మల్లారెడ్డి, ఎంపిటిసి నాగరాజు, మాజీ సర్పంచ్ కృష్ణ ప్రసాద్, మాజీ కోఆప్షన్ షేక్ జహంగీర్, ఇలా పాక శివప్రసాద్, షేక్ వాహీద్, మరియు తదితర కూటమినాయకులు కార్యకర్తలు తదితరులు అన్ని మండలం టీడీపీ అధ్యక్షులు, ప్రధాన నాయకులు ఉన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో సమావేశము జరిగింది తదితరులు ఉన్నారు.



# బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి

**- పారిశ్రామికవేత్తలకు కలెక్టర్ అంబేద్కర్ పిలుపు**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పేదరిక నిర్మూలనే పి 4 కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పష్టం చేశారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకు రావడానికి పారిశ్రామిక వేత్తలు మార్గదర్శులుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పి 4 విధానం, బంగారు కుటుంబాలు, మార్గదర్శుల పాత్రపై జిల్లాలోని పారిశ్రామిక వేత్తలకు కలెక్టరేట్లో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ పి 4 కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసు కుందని తెలిపారు. రాష్ట్రంలో సున్నా పేదరికమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని వివరించారు. ఇప్పటివరకు పారిశ్రామిక వేత్తలు సిఎస్ఆర్ ద్వారా ప్రజలకు పెద్దఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేశారని అన్నారు. ఇకనుంచి పేద కుటుంబాలను వ్యక్తిగతంగా దత్తత తీసుకొని, పేదరికం నుంచి వారు శాశ్వతంగా బయట పడే విధంగా చైతన్య పరచడం, అవసరమైన విద్య, ఇతరత్రా సహకారాన్ని అందించడం చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే జిల్లాలో 60,067 పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామని, వారిని దత్తత తీసుకొనేందుకు మార్గదర్శులు ముందుకు రావాలని కోరారు. బంగారు కుటుంబాల తుది జాబితాను తయారు చేసేందుకు ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు మరోమారు గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మార్గదర్శులు తమకు నచ్చిన ప్రదేశం నుంచి దత్తత తీసుకోవచ్చునని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సిపిఓ పి.బాలాజీ, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ కరుణాకర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తారాస్థాయికి చేరిన కూటమి ప్రభుత్వ కక్ష సాధింపులు

**- హామీల అమల్లో విఫలమైనందుకే డైవర్షన్ పాలిటిక్స్ - కూటమి ప్రభుత్వంపై వైస్సార్సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు చిన్న శ్రీను**







**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం,ధర్మపురి శిరీ సహస్ర రేసింగ్ ప్యాలెస్ తన క్యాంప్ కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించిన గౌరవ విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైస్సార్సీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను). ఈ సమావేశంలో మాట్లాడు తూ..ప్రజలకిచ్చిన హామీల అమల్లో విఫలమైన కూటమి ప్రభు త్వం.. దాన్నుంచి దృష్టి మరల్చేందుకు చేపడుతున్న కక్ష సాధిం పులు చర్యలు తారాస్థాయికి చేరాయి..కూటమి ప్రభుత్వం, చంద్రబాబు ప్రజలను మోసం చేసిన తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టి ప్రజలకు అండగా నిలబడుతూ ప్రజా క్షేత్రంలో ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడుతుంది. ప్రజల తరపున వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటాలను చూసి ఓర్వలేకే రకరకాల స్కామ్‌లను తెరపైకి తీసుకుని వచ్చి వాటిని వైయస్సార్సీపీ నాయకులపై రుద్దే కార్యక్రమం చేస్తోంది. ఎన్నికల హామీల అమలు చేయడంలో విఫలమయింది.. ప్రజల దృష్టని మరల్చడానికే కూటమి కక్ష సాధింపు చర్యలు చేస్తుంది.. లేని లిక్కర్ స్కాంతో ప్రజల దృష్టని మరల్చే ప్రయత్నం చేస్తుంది..ఏడాది కూటమి పాలనలో ఏరులై పారుతుంది..ఈ రాష్ట్రంలో మహిళలపై వరుస అఘాయిత్యాలు జరుగుతున్నాయి.. మీ తప్పులు కప్పి పుచ్చుకునేందుకు తెరపైకి లేని లిక్కర్ స్కాం తీసుకొచ్చారు. మీ కేసులకు, అరెస్టులకు భయపడేది లేదు. ప్రజల తరపున మా పోరాటం ఆగదు. ప్రభుత్వాన్ని హెచ్చరించిన చిన్న శ్రీను.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎలక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# పుస్తకం పరబ్రహ్మ స్వరూపం : మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కె వి ఎల్ రాజు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** పుస్తకం పరబ్రహ్మ స్వరూపం అని మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కె వి ఎల్ రాజు పేర్కొన్నారు. పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో విజయనగరం ఫోర్ట్ క్యాంపస్‌లో గల స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ పుస్తకాలు కొలువై ఉండే దేవాలయం గ్రంథాలయం అని పుస్తకాలతోనూ, గ్రంథాలయాలతోను విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ముడిపడి ఉంటుందని అన్నారు. మంచి పుస్తకాలు కొలువై ఉండే గ్రంథాలయాలు విలువ కట్టలేనివి అని విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను ఉపయోగించుకున్న ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ఆవశ్యకత పై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన బి మాళవిక, బి గౌరీశ్వరి, వి జ్యోతిర్మయి పట్నాయక్



లకు గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురు ప్రసాద్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బిఎస్ఎన్ రాజులతో కలిసి పుస్తకాలను, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, రచయిత కాగుపాటి నారాయణమూర్తి, సంఘం కార్యదర్శి సుభద్ర దేవి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కే హరికృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనే సీఎం చంద్రబాబు లక్ష్యం : చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి



**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పి4 రూపాకల్పన. పి4 అంటే పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్ షిప్. సంపన్నులను సామాజిక అభివృలో భాగస్వాములు కావలని బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి అన్నారు. ఈ మేరకు నగర పంచాయతీ పరిధిలోని ఇసుక పాలెం సచివాలయంలో జరిగిన పి4 కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ధనిక పేద వర్గాల మధ్య అంతరాలు తగ్గించే కార్యక్రమంలో ఆర్థిక స్థితిమంతులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సంపన్న వర్గాలు పేదలకు ఆర్థిక చేయూతనిచ్చి అసమానతలు లేని సమాజం కోసం కృషి చేయాలని కోరారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు పి4 విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. పి4 అంటే పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్ షిప్ అని సంపన్నులను సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం పి4 ఉద్దేశమన్నారు. అవసరమైతే దారిద్ర్య రేఖకు దిగువన వున్న కొన్ని కుటుంబాలను గుర్తించి వారికి ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికీ అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మహీధర్ రెడ్డి, శ్రీహరి, మెప్మా సిఇఒ నర్మదలతో పాటు సచివాలయ సిబ్బంది మధులత, జగదీష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు తీపి కబురు

## - హెల్త్ స్కీం ప్రీమియం చెల్లింపుకు జిల్లా కలెక్టర్ సుముఖత

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జర్నలిస్టుల హెల్త్ కార్డుల ప్రీమియం సీఎస్ఆర్ నిధుల నుంచి చెల్లించేందుకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సుముఖత వ్యక్తం చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజెఎఫ్) జిల్లా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ఈశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టుల హెల్త్ కార్డుల రెన్యువల్, ప్రీమియం చెల్లింపు గూర్చి గతంలో మీ దృష్టికి తీసుకువచ్చామన్నారు. తాజాగా రెండు రోజుల క్రితం విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధర్ ప్రసాద్ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి రిపోర్టర్స్ చెల్లించాల్సిన 1250 రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. జిల్లాలో గల పాత్రికేయులకు మీరు కూడా సీఎస్ఆర్ నిధుల నుంచి అర్హత కలిగిన పాత్రికేయులకు ఆ విధంగా చెల్లింపులు జరిపి ఆదుకోవాలని కోరారు. గత కలెక్టర్ రవి పటాన్ శెట్టి కూడా మాకు సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి చెల్లింపులు జరిపి తన వంతు సహాయం అందించారని తెలిపారు. జిల్లాలో గల రిపోర్టర్స్‌లో 95 శాతం బిలో



పావర్టీ కేటగిరీలో ఉన్నారని, మాకు కనీసం ఏ విధమైన వేతన చట్టాలు లేవని, సామాజిక సేవతో ముడిపడి ఉన్న మా పాత్రికేయుల పరిస్థితి గమనించి రాష్ట్రంలో పలు జిల్లాల్లో సీఎస్ఆర్ ఫండ్స్‌ను మా సంక్షేమానికి వెచ్చిస్తున్న నేపథ్యంలో మా వినతిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీనికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్, ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా, యూనియన్ నాయకులు బి.కొండలరావు, పి.నాగ, శేఖర్, గణేష్, గంటా శ్రీను, షన్ముఖ్, అమీద్ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం-2005 పై అవగాహన కలిగి ఉండాలి

**తిరుపతి, (రాజధాని వార్తలు):** సమాచారకు చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయ తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏ.షణ్ముగం అన్నారు. బుధవారం తిరుపతి లోని యూత్ హాస్టల్‌లో ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం విభాగం వారు సమాచార హక్కు చట్టం- 2005 పైన మహిళా సంఘం సభ్యులు, మహిళలకు, రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగం సమాచారం తెలుసుకోవాలి అనుకున్న వారు సమాచార హక్కు చట్టం-2005 దరఖాస్తు చేయాలని కోరారు. కావలసిన సమాచారంను నిబంధనల ప్రకారం వారు చలానా కట్టి 30 రోజులలోపు పొందవచ్చు అన్నారు. కావాల్సిన సమాచారాన్ని వారికి పోస్ట్ ద్వారా గాని లేదా సంబంధిత డాక్యుమెంట్స్ ద్వారా గాని సమాచారం అందించడం జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏ.షణ్ముగం వివరించారు. ఈ సమాచార హక్కు చట్టం - 2005 ప్రకారం ఎలాంటి సమాచారం అయినా కూడా సంబంధిత డిపార్ట్మెంట్స్‌లలో మనం చలనా కట్టి మనకు కావలసిన సమాచారాన్ని 30 రోజులలోపు తెలుసుకోవచ్చు అని




ఈ చట్టం ప్రాముఖ్యత గురించి మహిళా సంఘం సభ్యులకు, మహిళలకు, రైతులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సమాచార హక్కు చట్టం 2005 పైన ఒక రోజు అవగాహన సదస్సు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం పట్టాభి రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు మహిళలు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan